ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 280 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 6 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### భారీగా తగ్గిన వెండి

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతున్నాయనే సంకేతాల నేపథ్యంలో వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. సోమవారం ఎంసిఎక్స్ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.21 వేలు తగ్గింది. మధ్యాహ్నం తర్వాత ఒక్క గంటలోనే కిలో వెండి ధర భారీగా తగ్గి రూ.2,33,120 కు చేరింది. ముఖ్యంగా ఉక్రెయిన్-, రష్యా యుద్ధానికి సంబంధించి సానుకూల పరిణామాలు కనిపించడంతో పెట్టుబడిదారుల్లో లాభాల స్వీకరణ కనిపించింది.

### ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు

కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శని వారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబంధిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్దిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్థవంతమైన రీ ఛార్జింగ్కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రేసిబిలిటీ) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది.

# ప్రత్యేక యాప్‌ల ద్వారా మోసాలు

- ప్రత్యేక యాప్‌లతో గాలం వేస్తున్న సైబర్ మోసగాళ్లు
- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైపోతున్న యువత
- ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల ప్రాణాలు బలి తీసుకుంటున్న యువకులు
- ప్రత్యేక యాప్‌ల బెట్టింగులతో యువతకు గాలం
- రూ.లక్షల్లో డబ్బులు కొట్టేస్తున్న సైబర్ నేరగాళ్లు



హైదరాబాద్

లైన్ బెట్టింగ్ యువత ప్రాణాలు తీస్తోంది. ప్రతి ఒక్కరు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఆశపడతారు. అందులో భాగంగా కొందరు యువత ఆన్‌లైన్ పందేలకు ఆకర్షితులై రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆ తర్వాత అవమాన భారంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. ఒకదాని వెంట ఒకటి బెట్టింగ్, గేమింగ్ ఇలా పేరు ఏదైనా ఆన్‌లైన్ ఆటలు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఇలా అడ్డదారుల్లో డబ్బు సంపాదించాలి, రాత్రికి రాత్రే సంపన్నులు అవ్వాలనే అత్యాశ వల్ల చివరికి రూ.వేలు, రూ.లక్షలు - మిగతా3లో



## ఈ ప్రపంచం డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లదు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రపంచంలోని జనాభాను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు.
- ఎవరు రాజ్య విస్తరణకు ప్రయత్నించినా దాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేరు
- హిట్లర్, ముస్సోలినీ లాంటి వాళ్లు కూడా అలాంటి ప్రయత్నాలు చేసి కనుమరుగై పోయారు
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

# కవిత ఆరోపణలు.. చర్యలు తీసుకోని సీఎం

- టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుంది
- బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరింది



హైదరాబాద్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. - మిగతా3లో



## బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్

- చైనాను దాటేసిన భారత్
- ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా భారత్
- 184 కొత్త పంట వంగడాలను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- దిగుబడి పెంచే విత్తనాల అభివృద్ధిలో కీలక ముందడుగు
- పప్పులు, నూనె గింజల ఉత్పత్తి పెంచాలని శాస్త్రవేత్తలకు సూచన

# మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

- పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా
- సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయమని సూచన
- కేంద్ర ప్రభుత్వ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైతే ప్రాజెక్టును ఆపే నిర్ణయాధికారాన్ని ఇస్తాం.
- మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని అవకాశం ఇచ్చారు



ఢిల్లీ

పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్ట్ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్ట్‌పై మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించండి అంటూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సూచించారు. అనంతరం, కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా చేశారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. ఈ ప్రాజెక్టుతో గోదావరిలో తమ వాటా తగ్గుతుందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్‌కు సంబంధించి మూడు పరిష్కారాలను సుప్రీంకోర్టు సూచించింది. సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయమని సూచన కేంద్ర ప్రభుత్వ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైతే ప్రాజెక్టును ఆపే - మిగతా3లో



# కవిత కొత్త పార్టీ జాగృతి!

- రాజకీయంగా అందరూ మద్దతు ఇవ్వండి
- త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తా
- ఇంటి పార్టీ నుంచి అవమాన భారంతో బయటకు వస్తున్నా
- గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతాం.. సమస్యలపై పోరాడుతాం

హైదరాబాద్

ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారా? అంటే అవుననే సమాధానం చెప్పారు కవిత. సోమవారం నాడు శాసనమండలి నుంచి బయటకు వచ్చిన తరువాత గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు కవిత. కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. తన నేతృత్వంలో నడుస్తున్న జాగృతి సంస్థనే కొత్త పార్టీగా - మిగతా3లో



## అమెరికా నిర్బంధంలో వెనెజువెలా అధ్యక్షుడు...

- ఘాటుగా స్పందించిన చైనా
- ఇతర దేశాల సౌరభౌమత్వాన్ని అమెరికా ఉల్లంఘిస్తోందన్న చైనా విదేశాంగ మంత్రి
- ఏ దేశానికి అంతర్జాతీయ జడ్జిగా వ్యవహరించే అర్హత లేదని వ్యాఖ్య
- బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ సమర్థించదన్న వాంగ్ యీ

## సముద్ర ప్రతాప్ నౌక జలప్రవేశం



- నౌకా నిర్మాణం, మారిటైం సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ ఓ కీలక అడుగు
- సముద్ర ప్రతాప్ నౌకను గోవా షిప్‌యార్డు సంస్థ నిర్మించింది
- సుమారు 60 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో సముద్ర ప్రతాప్‌ను తయారు చేశారు
- మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర , పర్యావరణ రక్షణతో పాటు కోస్తా తీర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నది

## అత్యాచారం కేసులో దోషి.. పెరోల్‌పై 15వ సారి బయటకు వచ్చిన డేరా బాబా

- 40 రోజుల పెరోల్ పొందడంతో సునారియా జైలు నుంచి బయటకొచ్చిన గుర్మీత్
- 2017లో దోషిగా తేలినప్పటి నుంచి 15వసారి పెరోల్
- సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయంలో ఉంటాడని గుర్మీత్ అధికార ప్రతినిధి వెల్లడి




## సంపాదకీయం

# అభివృద్ధి ఫలాలు.. అందరికీ అందాలి

దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం తర్వాత ఆంగ్ల జాతి నుండి ముక్తి పొందిన భారతదేశం నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఆసియా ఖండంలో అత్యంత సిరిసంపదలున్న భారతదేశంలో పరాయి మూకల దౌర్జన్యాలతో, దండయాత్రలతో అపారమైన వనరులు కొల్లగొట్టబడ్డాయి. కులమతాలను రెచ్చగొట్టిన బ్రిటీషు పాలకులు దేశం వదలి పారిపోయినా వారి అవశేష జాడ్యాలు మనల్ని వదలడం లేదు. అవినీతి, పేదరికం, ఉగ్రవాదం, మేధావుల విదేశీవలస మన ప్రగతికి ప్రతిబంధకంగా మారాయి. అన్ని అవరోధాలను దాటుకుంటూ, గమ్యంలో ఎదురయ్యే ముళ్ళపొదలను ఒక్కొక్కటిగా పెకలించుకుంటూ భారత్ అభివృద్ధి వైపు పయనం సాగించడానికి ప్రయత్నం చేస్తున్నది. కులమతాల వైషమ్యాలు, భాషా దురభిమానాలు, ప్రాంతీయతత్వాలు భరత జాతి గుండెను కుదుటపడనీయడం లేదు. శత్రుశేషం పొంచి ఉంది. సరిహద్దు భద్రత ఇంకా ప్రమాదంలోనే ఉంది. అయినా మన త్రివిధ దళాల తెగువ, ధైర్యసాహసాలు మన ప్రశాంత జీవనానికి మార్గం సుగమం చేసాయి. దేశ విభజన భరతమాతకు తీరని వ్యథను మిగిలించగా, బంగ్లా విమోచనం మన దాయాది దేశపు పగను మరింత జ్వలింప చేసింది. ౼ాశ్రీంశీ =ఘుఃు - సభకు సారొస్తేనే సబబు! ౼ాఃజవతీఱంవఎవత్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన 'పాక్ణ అంతర్జాతీయంగా అభాసుపాలై, ఒంటరిగా మిగిలినా తన దుశ్చర్యలకు పదునుపెడుతూనే ఉంది. పహల్గాం దమనకాండ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తో పాక్ తన ధోరణి మార్చుకుంటుందని ఆశించడం అత్యాశే కాగలదు. ఇటీవలికాలంలో అమెరికా అధ్యక్షుడు భారత్‌పై అక్కసు పెంచుకోవడం, ప్రతీకార సుంకాలతో భారత్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించడంతో భారత్ చైనాకు దగ్గరవుతుందన్న సూచనలు కనిపించినా, ఇది ఆచరణ సాధ్యం కాదు. చైనా తన వక్రబుద్ధితో మన ఈశాన్య రాష్ట్రాలను కబళించాలనే 'డేగకన్ను'తో నిరంతరం మనపై ద్వేషాన్ని వెళ్ళగక్కుతున్నది. భద్రతా మండలిలో మన దేశానికి శాశ్వత సభ్యత్వం రాకుండా మోకాలడ్డుతున్నది. పాకిస్తాన్‌కు సమీప భవిష్యత్తులో తీవ్రనష్టం వాటిల్లనున్నా కేవలం మన దేశం మీదున్న గుడ్డి ద్వేషంతో పరాయి దేశాలవెంట పరుగెడుతున్నది. దాయాది దేశం తన కంటిని తానే పొడుచుకోవడానికి సిద్ధమవుతున్నది. బంగ్లాదేశ్ విమోచనంలో మనమెంత సహాయపడినా ఆ దేశం తిరిగి పాక్ విషపరిష్వంగంలో సేద తీరుతున్నది. అయినా భారత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిలబడగలుగుతున్నది. దేశం విద్య, వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఎంతగా దేశం అభివృద్ధిని సాధించినా, అభివృద్ధి ఫలాలు పెరిగిన ప్రజలకు అందడం లేదు. స్వాతంత్ర్యానికి పూర్వం 39 కోట్లున్న భారత జనాభా నేడు 140 కోట్లకు చేరింది. పెరిగిన జనాభాకు సరిపడా ఆహారాన్ని, ఆవాసాన్ని కల్పించడం దేశానికి తలనొప్పిగా మారింది. ౼ాశ్రీంశీ =ఘుఃు - పిపిపి ఉచ్చులో వైద్య కళాశాలలు ఇదే సందర్భంలో దేశానికి వెన్నెముక లాంటి వ్యవసాయ రంగం నిర్లక్ష్యనికి గురైనది. చదువుకున్న యువత విదేశీ వ్యామోహం వలన 'బ్రెయిన్ డ్రెయిన్ణ సమస్య కొనసాగుతూనే ఉంది. భారతీయ మేధస్సు ఉషస్సులు విదేశాలపై ప్రసరించడంవలన విదేశాలు అభివృద్ధిపథంలో సాగుతున్నాయి. మేధావుల వలసలను ఆపి, వారి మేధస్సుకు తగిన గుర్తింపు నిచ్చే చర్యలు ప్రారంభించకపోతే అది దేశానికే పెనుశాపంలా మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. సువిశాలమైన మన దేశంలో ఖనిజసంపదకూ, జలసంపదకూ, మానవ సంపదకూ లోటు లేనే లేదు. అయితే వీటి వినియోగమే సరిగాలేదు. అవినీతి అనే మహమ్మారి భారతీయ సామాజిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నది. వీటితో పాటు విద్య, వైద్య, ఆరోగ్య రంగాలలో చోటుచేసుకుంటున్న వినాశన కరమైన ధోరణి భావిప్రగతికి గొడ్డలిపెట్టు. వీటిని సరిదిద్దే చర్యలు చేపట్టాలి. భారతదేశంలో వనరులకు కొరత లేదు. అయినా అందరికీ కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్య వసతులను కల్పించలేకపోతున్నాం. అపారమైన జలసంపద ఉన్నా ఆ జలరాశిని వినియోగంలోకి తేలేకపోతున్నాం. నదుల అనుసంధానమే వృథగా కడలి పాలవుతున్న జలసంపద సద్వినియోగానికి ఏకైక మార్గం. నేటికీ దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది పరిశుభ్రమైన త్రాగునీటికి నోచుకోలేక, రోగాల పాలవుతున్నారు. పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్టు కానవస్తుంది. సరైన త్రాగునీటి సదుపాయం లేదు. చాలా పాఠశాలల్లో ఈనాటికీ సరైన మౌలిక సదుపాయాలు, మరుగు దొడ్లు లేకపోవడంతో చాలా మంది బాలికలు చదువుకు దూరమవుతున్నారు. ౼ాశ్రీంశీ =ఘుఃు - ప్రాణాలు తోడేసిన పైపునీళ్లు ౼ాఃజవతీఱంవఎవత్ విద్యా వ్యవస్థను చక్కదిద్దే ముందు పాఠశాలల్లో కనీస సదుపాయాలను మెరుగుపరచాలి. విద్యావంతులు పెరుగుతున్నా, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడం మన అభివృద్ధికి శరాఘాతం. గతంలో మాదిరిగా మన దేశంలో సాంప్రదాయబద్ధమైన వృత్తులు లేవు. విద్యావంతులంతా ఉద్యోగ వేటలో పడిపోవడం వలన వ్యవసాయం రంగం అనాథలా మారిపోయింది. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్నా, భారతదేశం ఆర్థిక మాంద్యపు కోరలలో చిక్కకపోవడానికి ప్రధాన కారణం మనది వ్యవసాయిక దేశం కావడమే. ఏనాటికైనా మన దేశాన్ని జీవనాడి వ్యవసాయ రంగమే. శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు వ్యవసాయరంగాన్ని కూడా ఇతోధికంగా ప్రోత్సహించాలి. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు. రైతన్న బ్రతుకులకు భద్రత కావాలి. వ్యవసాయ రంగంతో పాటు భావిభారతాన్ని సుశోభితం చేసే విద్యారంగాన్ని మెరుగు పరచాలి. మొత్తం విద్యారంగాన్ని ప్రభుత్వమే నడపాలి. ధనిక, పేద అనే తారతమ్యంలేకుండా అందరికీ సమానమైన విద్యావకాశాలు రావాలి. అన్ని స్థాయిల్లోను విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి. ఉచిత విద్యను అందించాలి. భారతదేశం ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోవాలంటే అవినీతి జాడ్యం అంతరించాలి. ఇది నా దేశం అనే భావన ప్రతీ ఒక్కరిలో నరనరాన జీర్ణించుకుపోవాలి. శతకోటి దరిద్ర్యాలకు అనంత కోటి

# ఇందిరా గాంధీ హంతకుల ఉరి తీత పూర్వాపరాలు



అమృత సర్ లోని స్వర్ణ దేవాలయం కేంద్రంగా బింద్రెన్ వాలా తదితరులు ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో, స్వర్ణ దేవాలయాన్ని ఉగ్రవాదుల నుంచి విడిపించే చర్యగా ఆపరేషన్ బ్లూ స్టార్ కు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ ఆదేశమిచ్చారు. భింద్రన్ వాలే, అమ్రిక్ సింగ్, షాబేగ్ సింగ్ వంటి ప్రముఖులు సహా, ఆ ఆపరేషన్ లో చాలామంది మరణించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సైన్యం పక్షన 79మంది, ఉగ్రవాదుల వైపున 492 మంది మరణించారు. ఐతే ఇతరుల కథనాల ప్రకారం సైనికులు 500 కన్నా ఎక్కువ సంఖ్యలోనూ, ఇతరులు 3వేల మంది, వీరిలో అధిక సంఖ్యాకులు సైనికచర్యలో చిక్కుకు పోయిన సాధారణ భక్తులు, చనిపోయారు. ఈ చర్యకు ప్రతీకారంగా ప్రధాని నివాసంలోనే ఆమె అంగరక్షకులే ఇందిర దారుణ హత్యకు పాల్పడ్డారు. ఈ దారుణ సంఘటన జరిగిన రోజు ఏమి జరిగిందో తెలుసుకుందాం. 1984 అక్టోబర్ 30 మధ్యాహ్నం ఇందిరా గాంధీ చేసిన చివరి ప్రసంగాన్ని ఎప్పటి లాగే ఆమె సమాచార సలహాదారు హెచ్‌వై శారదాప్రసాద్ తయారు చేశారు. ఆరోజు ఆమె ముందుంగా తయారు చేసుకున్న ప్రసంగ పాఠం కాకుండా సొంతంగా మాట్లాడారు. ఆమె మాట్లాడే తీరులోనూ మార్పు కనిపించింది. ఇదిర ప్రసంగం ఇలా సాగింది: cనేనీ రోజు ఇక్కడున్నాను. రేపు బహుశా ఇక్కడ ఉండక పోవచ్చు. నేను ఉంటానా, ఉండనా అన్న దానిపై నాకేమీ బాధ లేదు. నేను సుదీర్ఘ కాలమే జీవించాను. నేను ప్రజాసేవలో నా జీవితాన్ని గడిపినందుకు గర్వపడుతున్నా. నేను నా చివరి శ్వాస వరకూ సేవ చేస్తూనే ఉంటాను. నేను చనిపోతే నా ఒక్కో రక్తం బొట్టూ దేశాన్ని పటిష్టం చేయడానికి తోడ్పడు తుంది.c ఆ రాత్రి ఢిల్లీకి చేరుకునే సరికి ఇందిర బాగా అలసి పోయారు. ఆ రోజు రాత్రి ఆమె చాలా తక్కువ సేపు నిద్రపోయారు. ముందు గదిలో పడుకున్న సోనియా ఉదయం 4 గంటల సమయంలో ఆస్థమా మందు వేసుకోవడం కోసం బాత్రూంకు వెళ్లినప్పుడు ఇందిర మెలకువతోనే ఉన్నారు. ఆమె కూడా తన వెనుకే బాత్రూం వరకూ వచ్చారనీ, మందు వెదకడంలో తనకు సహాయం చేశారనీ సోనియా గాంధీ తన పుస్తకం ఃరాజీవ్ఃలో రాశారు. మళ్లీ ఇబ్బంది కలిగితే తనను పిలవమనీ, తాను మెలకువ తోనే ఉంటానని ఇందిర తనకు చెప్పారని సోనియా రాశారు. తక్కువ అల్పాహారం తీసుకుని, ఉదయం ఏడున్నరకల్లా ఇందిర తయారయ్యారు. ఆ రోజు ఆమె నల్లటి అంచున్న కాషాయ రంగు చీర కట్టుకున్నారు. మొదటి అపాయింట్‌మెంట్ పీటర్ ఉస్తీనోవ్‌తో. ఆయన ఇందిరా గాంధీపై ఒక డాక్యుమెంటరీ తీస్తున్నారు. ఒక రోజు ముందు జరిగిన ఒడిశా పర్యటనలో కూడా ఉస్తీనోవ్ ఆమెను చిత్రీకరించారు. మధ్యాహ్నం ఆమె బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి జేమ్స్ కాలెఘన్‌నూ, మిజోరం నాయకుడొకరినీ కలవాల్సి ఉంది. ఆ రాత్రి ఆమె బ్రిటన్ రాకుమారి యాన్‌కు విందు ఇవ్వాల్సి ఉంది. అల్పాహారం తర్వాత మేకప్ మ్యాన్ ఆమె ముఖంపై పౌడర్, బ్లషర్ అద్దుతుండగా డాక్టర్ కేపీ మాథుర్ అక్కడికి చేరుకున్నారు. ఆమెను చూడడానికి ఆయన రోజూ వచ్చే సమయం అదే. ఆమె డాక్టర్ మాథుర్‌ను లోపలికి పిలిచి అక్కడే మాట్లా డారు. తొమ్మిది గంటల 10 నిమిషాలకు ఆమె బయటికి వచ్చినప్పుడు ఎండ తీవ్రంగా ఉంది. ఆమెపై ఎండ పడకుండా ఉండేందుకు ఓ సైనికుడు నారా యణ్ సింగ్ నల్లరంగులో ఉన్న గొడుగును పట్టుకొని ఆమె పక్కన నడుస్తున్నారు. ఆమెకు కాస్త వెనకాల ఆర్కే ధావన్, ఇందిరా గాంధీ వ్యక్తిగత సహాయకులు నాథు రామ్ ఇంకొంచం వెనుక ఉన్నారు. అందరి కన్నా వెనుక ఆమె ప్రైవేట్ సెక్యూరిటీ ఆఫీసర్ సబ్ ఇన్స్పెక్టర్ రామేశ్వర్ దయాళ్ ఉన్నారు. ఇందిర అక్బర్ రోడ్ వైపు నుంచి వైట్ గేట్ వైపు వెళుతున్నప్పుడు ఆమె ధావన్‌తో మాట్లాడు తున్నారు. ఆరోజున కార్యక్రమాల గురించి ధావన్ ఆమెకు వివరిస్తున్నారు. ఇంతలో అక్కడ డ్యూటీలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు బియాంత్ సింగ్ రివాల్వర్ తీసి ఇందిరా గాంధీపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆమె కడుపులో దిగింది. పాయింట్ బ్లాంక్ రేంజిలో మరో రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. దీంతో ఆమె భుజం, గుండె, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి ఐదడుగుల దూరంలో సత్వంత్ సింగ్ తన థమ్సన్ ఆటో కార్బైన్ గన్ పట్టుకొని అక్కడే నిలబడి, ఇందిరా గాంధీ కింద పడుతు న్నప్పుడు దిగ్భ్రాంతి చెంది కదల లేక పోయాడు. బియాంత్ సింగ్ అతనిని కాల్పులు జరపమని గట్టిగా అరిచాడు. సత్వంత్ సింగ్ వెంటనే తన థమ్సన్ ఆటో కార్బైన్ లో ఉన్న మొత్తం 25 బుల్లెట్లను ఆమె శరీరంలోకి దించాడు. అప్పుడు అందరికన్నా వెనకాల నడుస్తూ వచ్చిన రామేశ్వర్ దయాళ్ ముందుకు పరిగెత్తే క్రమంలో ఆయన ఇందిరా గాంధీ దగ్గరకు చేరుకోక ముందే తొడ, కాళ్లపై సత్వంత్ జరిపిన కాల్పుల తో కిందపడి పోయాడు. అప్పుడే బియాంత్ సింగ్, సత్వంత్ సింగ్ తమ ఆయుధాలను కింద పడేసి cమేమేం చేయాలను కున్నామో చేసేశాం. ఇప్పుడు మీరు ఏం చేయాలను కుంటున్నారో చేసుకోండి.c అన్నారు. దగ్గరలో ఉన్న ఓ రూమ్ నుంచి ఐటీబీపీ దళాలు పరిగెత్తుకొచ్చి సత్వంత్ సింగ్‌ను అదుపులోకి తీసు కున్నాయి. ఎప్పుడూ అక్కడ ఓ అంబులెన్స్ ఉండేది. కానీ, ఆ రోజు డ్రైవర్ ఎందుకో రాలేదు. అప్పుడే ఇందిరా గాంధీ రాజకీయ సలహాదారు మఖన్ లాల్ ఫోతేదార్ కారు తీయండని అరిచాడు. ఇందిరమ్మను ఆర్కే ధావన్, భద్రతా అధికారి దినేష్ ఇద్దరూ అక్కడి నుంచి లేపి తెల్లటి అంబాసిడర్ కారు వెనుక సీటులో పడుకో బెట్టారు. ముందు సీట్లో ధావన్, ఫోతేదార్, డ్రైవర్ ముగ్గురూ కూర్చున్నారు. సోనియా గాంధీ అరుస్తూ పరిగెత్తుకుని వచ్చారు. రక్తసిక్తమైన ఇందిర తలను సోనియా గాంధీ తన ఒడిలో పెట్టుకున్నారు. కారును వేగంగా ఎయిమ్స్ వైపు కు తీస్తుళ్లారు. సోనియా గాంధీ గౌన్ ఇందిరా గాంధీ రక్తంతో తడిసి పోయింది. కారు తొమ్మిది గంటల 32 నిమిషాలకు ఎయిమ్స్‌కు చేరింది. ఎమర్జెన్సీ వార్డు గేటు తెరిచి ఇందిరా గాంధీని కారు నుంచి కిందకి దింపేందుకే మూడు నిమిషాల సమయం పట్టింది. అప్పుడు అక్కడ ఒక్క స్ట్రెచర్ కూడా అందుబాటులో లేదు. ఎలాగోలా ఒక స్ట్రెచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందిరా గాంధీని కారు నుంచి బయటకు తీసుకు వస్తున్నపుడు అక్కడున్న డాక్టర్లు కంగారు పడుతూ, వెంటనే ఎయిమ్స్ సీనియర్ కార్డియాల జిస్టుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కొద్ది నిమిషాల్లోనే డాక్టర్ గులేరియా, డాక్టర్ ఎంఎం కపూర్, డాక్టర్ ఎస్ బలరాం అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఎలక్ట్రో కార్డియోగ్రామ్‌లో ఇందిరా గాంధీ గుండె ఎక్కడో పని చేస్తున్నట్లుగా చూపిస్తోంది కానీ పల్స్ రేట్ మాత్రం చూపించడం లేదు. ఒక డాక్టరు ఆమె ఊపిరి తిత్తులకు ఆక్సిజన్ చేరాలని, ఆమె మెదడు పని చేయాలని ఆమె నోటి ద్వారా శ్వాస నాళంలోకి ఒక ట్యూబు వేశాడు. ఇందిరా గాంధీ శరీరంలోకి 80 బాటిళ్ల రక్తాన్ని ఎక్కించారు. cఆమెను చూసిన వెంటనే ఆమె ఇక లేరని అనుకున్నాను. దాన్ని నిర్ధారించేందుకు ఈసీజీ స్కానింగ్ చేశాం. అప్పుడే అక్కడున్న ఆరోగ్య శాఖ మంత్రి శంకరానంద్‌ను ఇప్పుడేం చేద్దాం అని అడిగా. ఆమె మరణించారని ప్రకటించాలా? అని అడిగితే ఆయన వద్దన్నారు. ఆ తర్వాత ఆమెను ఆపరేషన్ థియే టర్‌లో తీసుళ్లాంc అని డాక్టర్ గులేరియా పేర్కొన్నారు. డాక్టర్లు ఆమె శరీరాన్ని హార్ట్ అండ్ లంగ్ మెషీన్‌పై పెట్టారు. ఈ మెషీన్ వల్లే ఆమె రక్త ఉష్ణోగ్రత 37 డిగ్రీల నుండి 31 డిగ్రీలకు పడిపోయింది. ఆమె చనిపోయారని తెలిసినా ఎయిమ్స్ ఎనిమిదో అంతస్తుపై ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఆమెను తీసుళ్లారు. కాల్పులతో ఆమె కాలేయంలో కుడి భాగం ఛిద్రమైందని నిర్ధారించారు. ఆమె పెద్ద ప్రేగులో దాదాపు 12 రంధ్రాల య్యాయి. చిన్న ప్రేగు కూడా దాదాపు దెబ్బతింది. ఓ ఊపిరితిత్తి లోకి బుల్లెట్ దూసుళ్లింది. బుల్లెట్ల తో ఆమె వెన్నెముక కూడా దెబ్బ తింది. కేవలం ఆమె గుండె మాత్రమే సురక్షతంగా ఉంది. ఇందిర మరణించారని కాల్పులు జరిపిన నాలుగు గంటల తర్వాత ప్రకటించారు. దాదాపు రెండు గంటల 23 నిమిషాలకు ఇందిరా గాంధీ ఇక లేరని ప్రకటించారు. ఇందిరా గాంధీపై ఇలాంటి దాడి జరగొచ్చనే విషయంపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ముందే ఆందోళన వ్యక్తం చేశాయని ఇందిరా గాంధీ జీవిత చరిత్ర రాసిన ఇందర్ మల్హోత్రా పేర్కొన్నారు. సిక్కు భద్రతా సిబ్బందిని మొత్తం ఆమె ఇంటి నుంచి తీసేయాలని ఇంటిలిజెన్స్ ఏజెన్సీలు సిఫారసు కూడా చేశాయి. కానీ దీనికి సంబంధించిన ఫైలు ఇందిరా గాంధీ వద్దకు వెళ్ళిన పుడు ఆమె ఆగ్రహించి cఆరింట్ వి సెక్యులర్ ? (మేము లౌకిక నాయ కులం కామా?) అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఒకేసారి ఇద్దరు సిక్కు భద్రతా సిబ్బందిని ఆమె వద్ద డ్యూటీలో ఉంచ కూడదని నిర్ణయించారు. సందర్భం కలిసొచ్చి బియాంత్, సత్వంత్ ఇద్దరూ ఒకేచోట ఉండి ఆపరేషన్ బ్లూ స్టార్ కి ఇందిరా గాంధీపై ప్రతీకారం తీర్చుకున్నారు. ఇందిరా గాంధీ హత్య కేసులో నిందితులకు చివరకు ఉరిశిక్ష విధించ బడింది. ఐదేండ్ల తర్వాత ఇందిరా గాంధీని చంపారన్న నేరారోపణలపై తీహార్ జైలులో బియాంత్‌సింగ్, సత్వంత్ సింగ్, కేహార్ సింగ్ ముగ్గురికి ఉరిశిక్ష విధించబడి, 6 జనవరి 1989న శిక్ష అమలు చేయబడింది.

# బహుముఖ ప్రజ్ఞాశాలి బాడిగ నరసింహారావు



ఆయన నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర్ కు నట జీవిత ఆరంభం లో స్త్రీ పాత్ర ధారణలో అభినయం నేర్పారు. మహా నటి సావిత్రికి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. బందా, స్థానం, బళ్ళారి, సిఎస్సార్, కస్తూరి, రేలంగి లాంటి మేటి నటులతో కలిసి నటించారు. కవి సామ్రాట్ విశ్వనాథచే తన నాట్యానికి భావ నాట్యం అనే పేరు పెట్టబడి, హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు ఆశు కవితాశీ స్సులు, స్థానం నరసింహా రావుచే బంగారు పతకం అందుకున్నారు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి వంటి కవుల గీతాలకు నాట్యాన్ని కూర్చారు. స్త్రీ పాత్ర ధారణలో సాటిలేని మేటి అనిపించు కున్నారు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి బాడిగ వెంకట నరసింహారావు. ఒకటిన్నర శతాబ్దాల తెలుగు నాటక రంగ చరిత్రలో ప్రత్యేక స్థానం పొందింది గుడివాడ నాటక రంగం. పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘీక నాటకాల ప్రదర్శనలకు కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచింది. ఎందరో నటులు, నటీమణులు, సంగీత విద్వాంసులు, నృత్యకారులు, రచయితలు, చిత్రకారులు, జానపద కళాకారులు, నాటక సంస్థలు, డ్రామా డ్రెస్ కంపెనీలు, వివిధ వాయిద్య కారులతో సుసంపన్న మయింది. వెండితెరకు తళుకు లీనిన తారలను, నేపథ్య సంగీతానికీ, గానానికి అజరా మరమైన స్వరాన్ని అలంకరించింది గుడివాడ. బివి స్వగ్రామం కౌతవరం అయినా, గుడివాడ లో స్థిర నివాసం ఏర్పర చుకొని కళాకా రునిగా ప్రసిద్ధి ౖక్కారు బి.వి.నర సింహారావుగా లబ్ధ ప్రతిష్టులయిన బాడిగ వెంకట నరసింహారావు. 1913 ఆగస్టు 15న కృష్ణాజిల్లా కౌతరం గ్రామంలో జన్మించిన బి.వి. వందల సంఖ్యలో బాలగేయాలు రాశారు. కథలూ, నాటికలు, గేయ నాటికలు, బాల సాహిత్యంపై అనేక వ్యాసాలు రాశారు. బాల సాహిత్యం తయారు చేయడమే గాక, ఆడి, పాడి ప్రచారం చేశారు. బాడిగ వెంకట నరసింహా రావు (ఆగస్టు 15, 1913 - జనవరి 6, 1994) బాలబంధు బిరుదాం కితుడు, ప్రముఖ కవి, సాహితీ వేత్త, బాల సాహిత్య కారుడు, నటుడు, నాట్యా చార్యుడు, చిత్రకారుడు, బాల గేయ రచయితగా గుడివాడ పేరును దేశమంతటా చాటిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రంగస్థలం మీద స్త్రీ వేషధారణ చేయటంలో అందెవేసిన చేయి. వెండి తెర వేల్పులు... అక్కినేని నాగేశ్వర్ రావు కు ఆడవేషాలు వేసే కాలంలో అభిన యంలో ఆయన శిక్షణ ఇచ్చారు. మహా నటి సావిత్రిని నృత్యంలో తీర్చి దిద్దారు. అభినయం, సంగీ తం, చిత్రలేఖనం పుట్టుకతో ప్రాప్తిం చాయి. తోటి పిల్లలతో కలసి ఆవూ పులి, హరిశంద్ర, ధ్రువ, మొదల యిన చిన్న నాటకాలు వేయడంతో ప్రారంభమయినది బి.వి. రంగస్థల జీవితం. కాకినాడ ఆంధ్ర సేవా సంఘంలో కస్తూరి శివరావు, రేలంగి వెంకట్రామయ్య ఆయనకు సహా ధ్యాయులుగా ఉండేవారు. గయో పాఖ్యానం లోని కృష్ణార్జునుల సంవాదాన్ని పరబ్రహ్మ శాస్త్రి వేయించారు. ఇందులో అర్జును డుగా బి.వి నటించారు. గజేంద్ర మోక్షం కథ గీతాన్ని ఆనంద భైరవి రాగాన్ని, ఆది తాళంలో నేర్చు కున్నారు. కూచిపూడి భాగవతుల యక్ష గానాలు, దేవదాసి నృత్యం, చూచిందే తడవుగా అభినయించే వారు. కిలాంబికృష్ణమాచార్యులు వద్ద అనార్కలి నాట్య శిక్షణ తీసు కున్నారు బివి. తులాభారం లో సత్యభామ, రుక్మాంగదలో మోహిని, చింతామణిలో చింతా మణి, పాత్రాభినయాన్ని క్షణ్ణంగా అభ్యసించి ప్రదర్శించారు. 1940లో మద్రాసు ఆంధ్ర సంఘం లో బి.వి సరసన సలీంగా బందా కనక లింగేశ్వర రావు నటించారు. స్థానం నరసింహారావు, బళ్ళారి రాఘవ, సిఎస్సార్ , నగరాజారావు, కస్తూరి శివరావు, రేలంగి వెంకట్రా మయ్య, మొదలయిన గొప్ప నటులతో కలసి ఎన్నో స్త్రీ పాత్రల లో నటించారు. క్షణం లో చీర సింగారించి కోవటం ఆయనకే సొంతం. సినీ నటి సావిత్రికి నృత్యంలో, అక్కినేనికి ఆడవేషాలు వేసే కాలంలో అభినయంలో శిక్షణ ఇచ్చారు. ఆంధ్ర జాలరి సంపత్ కుమార్ ఆయన ప్రశిష్యులు. అంతర్జాతీయ ఖ్యాతి పొంచిన కోరాడ నరసింహా రావు బి. వి.కి ఏకలవ్య శిష్యులు. చల్లపల్లి, ముక్త్యాల, జయంతి పురం, బొబ్బిలి, వేగాయమ్మ పేట, సంస్థానాలలో జానపద నాట్యం చేసారు. బందరు టౌన్ హాల్ లో మునిమాణిక్యం నరసింహారావు బి.వి. నాట్య ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఆనాటి ప్రదర్శనకు చిత్రకారుడు, రచయిత అడవి బాపిరాజు వ్యాఖ్యాత. బి.బి. నాట్యం తిలకించిన కవి సామ్రాట్ విశ్వనాథ ఆయన నాట్యానికి ఃభావనాట్యంః అని పేరు పెట్టారు. 1942లో పాలకొల్లులో బి.వి. నాట్యాన్ని తిలకించిన ఆదిభట్ల నారాయణ దాసు మనసు పుల కించి అమాంతంగా రంగస్థలం మీదికి దుమికి ఆశువుగా పద్యం చెప్పి ఆశీర్వదించారు. 1944లో బందరు నాటక కళా పరిషత్తు లో స్థానం నరసింహా రావు, బి.వి నాట్యానికి ముగ్ధులై బంగారు పతాక మిచ్చారు. బి.వి. ఏకబిగిన మూడు గంటల ప్రదర్శన ఇచ్చే వారు. దాదాపు 30 ఏళ్లపాటు నాట్య రంగానికి బి.వి. విశేషసేవ చేశారు. జానపదాలకు నాట్యాభి నయం కూర్చారు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి వంటి కవుల గీతాలకు నాట్యాన్ని కూర్చారు. బాలరసాలు, పాలబడి పాటలు, ఆవు - హరి శ్చంద్ర, విరిసిన పూలు, నా కథలు, ప్రియదర్శి, బాలతనం, చిన్నారి లోకం, పూల బాలలు, ఋతువాణి వంటి 17 పుస్తకాలు రచించారు. బి.వి. తనకు చలం రాసిన లేఖలను పుస్తకంగా వెలువరించారు. 1958 నుండి నాట్య ప్రదర్శనలు ఇవ్వటం ఆపేసి బాల రచయితగా మారి పేరు ప్రఖ్యాతులు గాంచారు. సామాన్య కుటుంబం నుండి బహు ముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగిన బివి 1968లో ఉద్యోగ విరమణ చేసి గుడివాడలో స్థిర నివాసం ఏర్పరచు కొని వివిధ రకాల సేవలు అందిస్తూ, శేష జీవితాన్ని గడిపారు. పిల్లల కోసం ఎన్నో రచనలు చేసి ఃబాల బంధుః గా సత్కరించ బడ్డారు. ఆయన రచించిన పాల బడి పాటలు'కు 1958లో జాతీయ బహుమతి పొందింది. 1975లో ప్రపంచ తెలుగు మహా సభలలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ 'బాలబంధు' బిరుదాన్ని వారికి ప్రసాదించింది. ఃభారత కళా నిధిః గా బిరుదు పొందిన బివి, తమ సన్నిహితులు, ఆప్త మిత్రులు గుడిపాటి వెంకట చలం శత జయంతి సభకు అధ్యక్షత వహిం చేందుకు విజయవాడ పుస్తక మహోత్సవానికి వెళ్లి సభలో ప్రసంగిస్తూ, గుండె పోటుకు గురై, 1994 జనవరి 6న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

# చరిత్ర సృష్టించనున్న సిద్ధరామయ్య!

**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. జనవరి ఆరు రేపటితో అత్యధిక కాలం ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి రికార్డును ఆయన సమం చేయనున్నారు. ఆ తరువాత రోజుతో అధిక కాలం పనిచేసిన వ్యక్తిగా కొత్త రికార్డు సృష్టించనున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటకలో ముఖ్యమంత్రి అనుచరులు, శ్రేయోభిలాషులు సంబురాలు చేసుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠం కోసం జరిగిన హంగామా అంతా ఇంతా కాదు. ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇద్దరూ సీఎం కుర్చీ కోసం పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో హైకమాండ్ ఎంట్రీతో ప్రస్తుతానికి ఆ విషయం సద్దుమణిగింది. అయితే ఇదిలా ఉండగా ప్రస్తుతం సిద్ధరామయ్య సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. రేపటితో అత్యధిక కాలం సీఎంగా పనిచేసిన కాలాన్ని సమం చేసిన ఆయన... ఎల్లుండితో ఆ రికార్డు బద్దలు కొట్టనున్నారు. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డి. దేవరాజ్ ఉర్స్ ఇంతకాలం వరకూ అక్కడ అధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఉన్నారు. ఆయన 1972-77, 1978-80 కాలంలో సీఎంగా కర్ణాటకకు సేవలందించారు. మెత్తంగా ఆయన 7సంవత్సరాల 239రోజులు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే రేపటితో సిద్ధరామయ్య ఆరికార్డును సమం చేస్తారు. 2013-18తో పాటు 2023నుంచి ఆయన సీఎంగా కొనసాగుతున్నారు. దీంతో జనవరి ఏడుతో అత్యధిక కాలం కర్ణాటకకు సీఎంగా పనిచేసిన వ్యక్తిగా ఆయన రికార్డు



సృష్టించనున్నారు. అయితే ఈ రికార్డుపై సిద్ధరామయ్య స్పందించారు... "ప్రజల ప్రేమ ఆశీర్వాదం వల్లే ఇంతకాలం పాటు ముఖ్యమంత్రిగా సేవలందించా, రాజకీయాల్లోకి ప్రవేశించేటప్పుడు మంత్రి, ముఖ్యమంత్రిగా సేవలందిస్తానని నేను అనుకోలేదు. కేవలం ఎమ్మెల్యేగా గెలవాలనుకున్నాను". అని సిద్ధరామయ్య అన్నారు. ఇప్పటివరకూ తాను మెత్తం 13 ఎన్నికల్లో పోటీచేస్తే ఎనిమిది ఎన్నికల్లో గెలిచానని తెలిపారు. తొలిసారి తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రజలే తనకు నిధులు సమకూర్చి గెలిపించారన్నారు. సచిన్ రికార్డును విరాట్ కోహ్లి బద్దలుగొట్టినట్లుగా తాను వాటిని అధిగమించానని సిద్ధరామయ్య సరదాగా అన్నారు.

# సముద్ర ప్రతాప్ నౌక జలప్రవేశం

పనాజీ: భారతీయ కోస్టు గార్డుకు చెందిన సముద్ర ప్రతాప్ నౌక ఇవాళ జలప్రవేశం చేసింది. గోవాలో జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. సముద్ర ప్రతాప్‌ను పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌గా వర్ణిస్తున్నారు. ఈ నౌకను స్వదేశీయంగా తయారు చేశారు. నౌకా నిర్మాణం, మారిటైం సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ ఓ కీలక అడుగు వేసింది. సముద్ర ప్రతాప్ నౌకను గోవా షిప్‌యార్డు సంస్థ నిర్మించింది. సుమారు 60 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో సముద్ర ప్రతాప్‌ను తయారు చేశారు. ఇండియన్ కోస్టు గార్డు వద్ద ఉన్న నౌకల్లో సముద్ర ప్రతాప్ అతిపెద్ద నౌకగా గుర్తింపు తెచ్చుకున్నది. మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర , పర్యావరణ రక్షణతో పాటు కోస్తా తీర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నది. మారిటైం సవాళ్లను ఎదుర్కొనే రీతిలో సముద్ర ప్రతాప్ యుద్ధనౌకను తయారు చేసినట్లు మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే నౌకల్లో 90 శాతం స్వంత వస్తువులను వాడే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రాథమికంగా పొల్యూషన్ కంట్రోల్ కోసం దీన్ని డిజైన్ చేశామన్నారు. సముద్ర పర్యారవణ రక్షణ వ్యూహాత్మక అవసరమని, నైతిక బాధ్యత అని ఆయన అన్నారు. అడ్వాన్స్‌డ్ ఎన్విరాన్మెంటల్ రెస్పాన్స్ సామర్థ్యం ఉన్న దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా అగ్రభాగాన నిలుస్తుందని మంత్రి అన్నారు. సముద్రాలు స్వచ్ఛంగా ఉంటే, వాణిజ్యం సురక్షితంగా సాగుతుందన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతియుత, స్థిరమైన మారిటైం ఎన్విరాన్మెంట్ కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. సుముద్ర ప్రతాప్ నౌక సుమారు 114.5 మీటర్ల పొడుగు



ఉంటుంది. 4200 టన్నులు బరువు ఉన్నది. సుమారు 22 నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది.

# స్థానికంగా బలపడుతోన్న కమలం

**న్యూఢిల్లీ :** భారతీయ జనతాపార్టీ.. ప్రపంచంలో అత్యధిక సభ్యంత్వం కలిగిన పార్టీ. 12 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉంది. ఉత్తరాది పార్టీగా పదేళ్ల క్రితం వరకు బీజేపీకి ముద్ర ఉండేది. కానీ తర్వాత దక్షిణాదిన కూడా పాగా వేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. కేరళ, తెలంగాణ, తమిళనాడులో పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే.. దక్షిణాదిలో బీజేపీ అర్బన్ పార్టీగానే గుర్తింపు ఉంది. కానీ 2025 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టింది. ప్రాంతీయ పార్టీలను మించి సీట్లు గెలిచింది. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది.

**మహారాష్ట్రలో..**

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 117 స్థానాలతో ముందంజలో నిలిచింది. మిత్ర పక్షాలు ఈక్‌నాథ్ శిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ కలిసి 200+ సీట్లు సాధించాయి. మహాఘట్‌బంధన్‌కు 37 మాత్రమే వచ్చాయి. ఈ మైత్రి విజయం బీజేపీ దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల్లో బలపడుతుందనడానికి నిదర్శనం.

**కర్ణాటకలో అధికార పార్టీకి షాక్..**

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పట్టణ స్థానిక సంస్థల్లో బీజేపీ 40 సీట్లతో ఆధిక్యం చెప్పింది. కాంగ్రెస్ 23, జేడీఎస్ ఒకటి, స్వతంత్రులు 2 మాత్రమే గెలిచారు. అధికార పార్టీని కాదని అక్కడి ఓటర్లు బీజేపీకి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు.

**గోవాలో..**



ఉత్తరాది రాష్ట్రం గోవాలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ బీజేపీ?మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ కూటమి 32 సీట్లు సాధించింది. కాంగ్రెస్ 10, ఆప్ 1, స్వతంత్రులు 4. అధికార బీజేపీ స్థానిక స్థాయిలో బలపడినట్టు నిదర్శనం.

**అరుణాచల్ ప్రదేశ్..**

అరుణాచల్‌లో జిల్లా కౌన్సిల్‌లో బీజేపీ 170 సీట్లు, పంచాయతీల్లో 6,085 సీట్లు గెలిచాయి. పీపీఏ 648, ఎన్‌పీపీ 160, స్వతంత్రులు 627, కాంగ్రెస్ 216 గెలిచాయి. ఈశాన్య రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యం పెరగడం గమనార్హం.

**కేరళలో..**

కేరళ పంచాయతీల్లో యూడీఎఫ్ 505, ఎల్‌డీఎఫ్ 345, స్వతంత్రులు 64, బీజేపీ 26 సీట్లు గెలిచాయి. తిరువనంతపురం మున్సిపాలిటీలో బీజేపీ గణనీయ పురోగతి చెందింది. గతంతో పోలిస్తే చాలా పంచాయతీల్లో బీజేపీ విజయం షాధించింది. ఈ ఎన్నికలు బీజేపీ అట్టడుగుస్థాయి బలాన్ని చూపుతున్నాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ బలపడింది. 2024 లోక్‌సభ తర్వాత పార్టీ స్థానిక స్థాయిలో దృష్టి పెట్టి, దక్షిణ?ఈశాన్యంలో పట్టు పెంచుకుంది. తెలంగాణలో కూడా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది.

## ప్రపంచంలోనే అత్యంత భారీ శివలింగం..
## మధ్యలోనే నిలిచిపోయిన ప్రయాణం

ప్రపంచంలోనే అతిపెద్దదైన, అత్యంత బరువైన శివలింగం ప్రయాణం మధ్యలోనే నిలిచిపోయింది. తమిళనాడులోని మహాబలిపురంలో తయారైన శివలింగం అదివారం ఉదయం బీహార్‌లోని గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. గోపాల్‌గంజ్‌లో గండక్ నది (నారాయణి నది) పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ భారీ శివలింగాన్ని తరలించడం అక్కడి అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ భారీ శివలింగం బరువు సుమారు 210 టన్నులు కాగా.. దీనిని తరలిస్తున్న 106 చక్రాల ప్రత్యేక ట్రైలర్ (లారీ) బరువు మరో 160 టన్నులు. ఈ రెండింటి మొత్తం బరువును ఆ వంతెన మోయలేదని నిపుణులు చెబుతున్నారు. వంతెనపై చాలాచోట్ల పగుళ్లు ఉన్నట్లు ప్రాథమిక తనిఖీల్లో గుర్తించడంతో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, బీహార్ రాజ్యపుల్ నిర్మాణ్ నిగమ్ లిమిటెడ్ బృందాలను పిలిపించినట్లు జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ సిన్హా తెలిపారు. బీహార్ మంత్రి అశోక్ చౌదరి కూడా గోపాల్‌గంజ్‌కు వచ్చి వంతెనను స్వయంగా పరిశీలించనున్నా రు. వారి పరిశీలన అనంతరం శివలింగం తరలింపుపై




క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ మహా శివలింగాన్ని తూర్పు చంపారన్ జిల్లా కేంద్రమైన మోతిహారిలోని విరాట్ రామాయణ్ ఆలయానికి తరలించాల్సి ఉంది. ఈ భారీ వాహనం మహాబలిపురం నుంచి 3,178 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 32 రోజుల్లో ఈ వాహనం గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. శివలింగం తూర్పు చంపారన్ చేరుకోవడానికి మరో రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, వాటి పరిస్థితి సంతృప్తికరంగా లేదని అధికారులు చెబుతున్నారు. ఒక మార్గంలోని వంతెన సామర్థ్యం సరిపోదని, మరో మార్గంలో కూడా అనేక చిన్న వంతెనలు, కల్వర్టులు ఉండటం తో భారీ వాహనం ప్రయాణించడం కష్టమని భావిస్తున్నారు. దాంతో శివలింగాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చేందుకు అధికారులు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు.

## బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్



బియ్యం ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు అగ్ర స్థానంలో ఉన్న చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా, చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితమైందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన 25 రకాల పంటలకు చెందిన 184 కొత్త వంగడాలను మంత్రి విడుదల చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధిలో భారత్ గొప్ప విజయం సాధించిందని, ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు బియ్యాన్ని ఎగుమతి చేసే ప్రముఖ దేశంగా మారిందని అన్నారు. ఈ కొత్త వంగడాలను సాధ్యమైనంత త్వరగా రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు పప్పుధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలోని గత 11 ఏళ్లలో 3,236 అధిక దిగుబడినిచ్చే వంగడాలకు ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. వాతావరణ మార్పులు, కరవు, నేలల లవణీయత వంటి సవాళ్లను తట్టుకునేలా ఈ కొత్త వంగడాలను రూపొందించినట్లు వివరించారు. ఒకప్పుడు ఆహార కొరత ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి చేరిందని చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. ఐసీఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విత్తన కంపెనీల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు.

## అత్యాచారం కేసులో దోషి..
## పెరోల్‌పై 15వ సారి బయటకు వచ్చిన డేరా బాబా




డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ 40 రోజుల పెరోల్ పొందడంతో సోమవారం సునారియా జైలు నుంచి విడుదలయ్యారు. తన ఇద్దరు భక్తురాళ్లపై అత్యాచారం చేసినందుకు 20 సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయన, 2017లో దోషిగా తేలినప్పటి నుంచి పెరోల్‌పై బయటకు రావడం ఇది 15వ సారి కావడం గమనార్హం. పెరోల్ కాలంలో, ఆయన హర్యానాలోని సిర్సాలో గల డేరా ప్రధాన కార్యాలయంలో ఉంటారని ఆ శాఖ ప్రతినిధి మరియు న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 16 సంవత్సరాల క్రితం జర్నలిస్టు హత్య కేసులోనూ గుర్మీత్ సింగ్‌ను కోర్టు 2019లో దోషిగా తేల్చింది. గతంలో 2025 ఏప్రిల్‌లో 21 రోజులు, 2025 ఆగస్టులో కూడా 40 రోజుల పెరోల్‌పై ఆయన బయటకు వచ్చారు. మరోవైపు గుర్మీత్ సింగ్‌కు పెరోల్ ఇవ్వడాన్ని సిక్కు సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి.

## అమెరికా నిర్బంధంలో వెనెజువెలా అధ్యక్షుడు



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అమెరికా సైనిక బలగాలు పట్టుకుని న్యూయార్క్‌కు తరలించిన ఘటన ప్రపంచవ్యాప్తంగా భారీ చర్చను రేపుతోంది. ఈ సంఘటనపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ, అమెరికా తనను తాను ప్రపంచ పోలీస్‌గా భావించుకుని ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఏ దేశానికి అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించడానికి అర్హత లేదని, బలప్రయోగంతో తమ ఇష్టాలను రుద్దడం సరికాదని స్పష్టం చేశారు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితి అస్థిరంగా ఉందని ఆయన చెప్పారు. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు అన్ని దేశాల సార్వభౌ మత్వాన్ని రక్షించాలని అన్నారు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనా, ఈ ఘటనను ఏకపక్ష దురాక్రమణగా అభివర్ణిస్తూ అమెరికాపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ సంబంధాలను మరింత దిగజారుస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## ఈ ప్రపంచం డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లదు



ప్రస్తుతం వెనెజువెలాలో నెలకొన్న పరిస్థితి ఈ ప్రపంచానికి మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రపంచంలోని జనాభాను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఎవరు రాజ్య విస్తరణకు ప్రయత్నించినా దాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేరని ఖర్గే అన్నారు. హిట్లర్, ముస్సోలినీ లాంటి వాళ్లు కూడా అలాంటి ప్రయత్నాలు చేసి కనుమరుగైపోయారని చెప్పారు. కొంతమంది కుటిల ఆలోచనలతో ప్రపంచ శాంతిని చెడగొట్టేందుకు ప్రయత్నించడం మంచిది కాదని అన్నారు. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఎప్పుడూ చెబుతుంటాడని, ఇప్పటివరకు దాదాపు 70 సార్లు ఈ విషయం చెప్పాడని తెలిపారు. ఈ ప్రపంచంలో తానే అత్యంత గొప్ప వ్యక్తినని, ఈ ప్రపంచం తనముందు మోకరిల్లుతుందనేది ట్రంప్ మాటలకు అర్థమని ఖర్గే చెప్పారు. కానీ ట్రంప్ ముందు మోకారిల్లాల్సిన అవసరం ఈ ప్రపంచానికి లేదని అన్నారు. మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ముందుకు పోతామని వ్యాఖ్యానించారు. 'బతుకు, బతుకనివ్వు' అనేది నెహ్రూ పాలసీ అని, అదే మా పాలసీ కూడా అని చెప్పారు. ట్రంప్ మాట్లాడిన ఒక ఆడియో విన్నానని, 'మోదీకి నేనంటే గౌరవమని, నా మాట వింటాడని నాకు తెలుసు' అన్నది ఆ ఆడియో సారాంశమని ఖర్గే అన్నారు. అంటే మోదీ తన కంట్రోల్‌లో ఉన్నాడనేది దీని అర్థమా..? అని ఆయన ప్రశ్నించారు. మోదీ ఎందుకు ట్రంప్ ముందు బెండ్ అవుతున్నాడో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ఇది దేశానికి ప్రమాదకరమని చెప్పారు. నిన్ను ప్రజలు ప్రధానిగా ఎన్నుకున్నది ట్రంప్ చెప్పినట్లు తలూపడానికి కాదని అన్నారు.

# హైదరాబాద్‌లో 'ట్రౌట్' చేపల సాగు కేంద్రం

**రంగారెడ్డి :** హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను రేపు కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు.రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది. అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం



చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఏటా 14 లక్షల ట్రౌట్ విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.మత్స్య రంగాన్ని కేవలం జీవనోపాధిగానే కాకుండా, ఒక సాంకేతిక ఆధారిత ఎగుమతి రంగంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇప్పటికే ఐటీబీపీతో ఒప్పందం చేసుకుని సరిహద్దు గ్రామాల్లో ఈ చేపల సరఫరాను ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న ఈ సరికొత్త సాగు కేంద్రం, భవిష్యత్తులో దేశీయంగా చేపల వినియోగాన్ని పెంచడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించనుంది.

# ముందుకు సాగని ఆయిల్ పామ్...

**కరీంనగర్ :** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి కోసం కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లలో ఒప్పంద నిబంధనల ప్రకారం పురోగతి సాధించని కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పురోగతి లేని ఆయిల్ పామ్ కంపెనీల ఫ్యాక్టరీ జోన్లను తగ్గిస్తూ, ఆయా ప్రాంతాలను తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఆయిల్ పామ్ (ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ని యంత్రణ) చట్టం, 1993, నిబంధనలు- 2008 ప్రకారం, ఆయిల్ పామ్ కంపెనీలు రైతు నాట్ల నుంచి 36 నెలల్లోపు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి, ఫ్యాక్టరీ జోన్ పరిధిలో రైతులకు సేవలు అందించాల్సి ఉంటుంది.అయితే పలు కంపెనీలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ప్రాసె సింగ్ యూనిట్ల ఏర్పాటు, నాట్ల విస్తరణ, నర్స రీ అభివృద్ధి వంటి అంశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించింది. వ్యవసామ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు సమీక్షలు నిర్వహించినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం తో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కరీంనగర్ జిల్లాలో కేటాయించిన 44,527 ఎకరాల కు 6,721 ఎకరా ల్లో మాత్రమే ఆయిల్‌పామ్ సాగులోనికి తెచ్చింది. కరీంనగర్ జిల్లాకు సంబంధించిన ఫ్యాక్టరీ జోన్‌ను రద్దు చేసి తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు.మ్యాట్రిక్స్ పామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో కేటాయించిన 30,552 ఎకరాలకుగాను, కేవలం 1,606 ఎకరాలు, అదేవిధంగా కేఎన్ బయోసైన్సెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు హనుమకొండలోని 9 మండలాలు,



వరంగల్ జిల్లాలలోని 2 మండలాలు కలిపి 14,000 ఎకరాలు లక్ష్యం ఇవ్వగా, కేవలం 2,136 ఎకరాలనే సాగులోనికి తెచ్చారు. ఆ జిల్లాల్లో ఫ్యాక్టరీ జోన్లను పూర్తిగా రద్దు చేస్తూ, వాటిని ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు. ప్రభుత్వం పంటల మార్పిడి అవసరాన్ని తెలియజేసేలా, వంటనూనెల దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ పామ్ కింద రాష్ట్రంలో ఈ కార్యక్రమా న్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వ్యవసాయశాఖ సెక్రటరీ తెలిపారు.

# ఏసీల్లేకుండా ఫ్యూచర్ సిటీ

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశానికే ఆదర్శంగా నిర్మించాలని సంకల్పించింది. తెలంగాణ విజన్ 2047లో భాగంగా దీనిని నిర్మిస్తోంది. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఫ్యూచర్ సిటీలోనే ఎకనామిక్ సమ్మిట్ నిర్వహించారు. భారీగా పెట్టుబడులు రాబట్టారు. ఈ నేపథ్యంలో సీఎం మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏసీలు లేకుండా సిటీ నిర్మిచాలని భావిస్తున్నారు. ఏసీలకు ప్రత్యామ్నా యంగా డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ (డీసీఎస్) ప్రవేశపెడుతోంది. ఫ్యూచర్ సిటీని తెలంగాణ ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో నిర్మించనుంది. రంగారెడ్డి జిల్లా మీరాఖాన్‌పేటలో ఈమేరకు పనులు జరుగుతున్నాయి. ఇందులో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ)లో ఏఐ సిటీ (300 ఎకరాలు), హెల్త్‌సిటీ (200 ఎకరాలు), ఎడ్యుకేషన్ హబ్ (500 ఎకరాలు), లైఫ్ సైన్సెస్ పార్క్ (3వేల ఎకరాలు) ఏర్పాటు.



గుజరాత్ గిఫ్ట్ సిటీ, పోచంపల్లి ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్ గేట్‌వేల్లో ఇప్పటికే డీసీఎస్ విజయవంతమైంది.ఏసీల ఏర్పాటుతో వాయు కాలుష్యం పెరుగుతుంది. ఇప్పటికే ప్లాస్టిక్ రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీలోనూ కాలుష్యం లేకుండా నిర్మించడంలో భాగంగా ఏసీలు లేకుండా చేయాలని నిర్ణయించింది. ఏసీలు వేడిని పెంచుతాయి. డీసీఎస్ ఒక సెంట్రల్ పాయింట్‌లో నీటిని చల్లబరిచి పైపుల ద్వారా భవనాలకు సరఫరా చేస్తుంది. గదులలోని ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు ఈ చల్లని నీటితో ఉష్ణోగ్రత తగ్గిస్తాయి. వేడెక్కిన నీరు తిరిగి ప్లాంట్‌కు వెళ్తుంది. మళ్లీ చల్లబడి పైపల ద్వారా తిరిగి వస్తుంది.డీసీఎస్‌తో 30 శాతం విద్యుత్ ఆదా అవుతుంది. పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. కార్బన్ ఉద్గారాలు 25?40% వరకు తగ్గుతాయి. ఫ్యూచర్‌సిటీలో మాల్స్, టౌన్‌షిప్‌లకు ఇది అనువైన మోడల్. దీర్ఘకాలంలో నిర్మాణ ఖర్చు తక్కువ, ఆస్తి విలువలు పెరుగుతాయి. తెలంగాణలో మొదటిసారి డీసీఎస్ ఫ్యూచర్ సిటీలో అమలవుతోంది. దీంతో ఈ నగరం గ్లోబల్ స్మార్ట్ సిటీల స్థాయికి ఎదుగుతుంది.

# కవిత ఆరోపణలు.. చర్యలు తీసుకోని సీఎం

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అనడం ఎమ్మెల్సీ కవిత అవగాహనా లోపమని తెలిపారు. సోమవారం నాడు శాసన మండలికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మండలిలో తనది ఇదే చివరి ప్రసంగమని కన్నీరు పెట్టుకున్నారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా తాను మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తన రాజకీయ భవిష్యత్‌తోపాటు తాను ఎదుర్కొన్న పరిస్థితులు, బీఆర్ఎస్ పార్టీపై కవిత హాట్ కామెంట్స్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఈ సందర్భంగా కవిత విజ్ఞప్తి చేశారు.

## కవిత కొత్త పార్టీ జాగృతి..!

-మొదటిపేజీ తరువాయి

అవతరించనుందని కవిత ప్రకటించారు. రాజకీయంగా అందరూ మద్దతు ఇవ్వండని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తానన్నారు. ఇంటి పార్టీ నుంచి అవమాన భారంతో బయటకు వస్తున్నానని.. గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతామన్నారు. సమస్యలపై పోరాడుతామన్నారు. రాజకీయాల్లో మార్పు తెచ్చే వేదికగా జాగృతి అవతరిస్తుందన్నారు కవిత. అంతకుముందు శాసనమండలిలో మాట్లాడిన కవిత కన్నీటిపర్యంతం అయ్యారు. ఇదే తన చివరి ప్రసంగం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఓ వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని, బలమైన శక్తిగా తిరిగి చట్టసభలకు వస్తానంటూ కవిత చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. అయితే, ఎమ్మెల్సీ కవిత తాజా వ్యాఖ్యలతో ఆమె కొత్త పార్టీపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది.

## మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయాధికారాన్ని ఇస్తాం.

3. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని అవకాశం ఇచ్చారు.

**జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు..**

అంతకుముందు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉంది కదా?. ప్లానింగ్ డాక్యుమెంటేషన్ ప్రిపరేషన్‌కి ఏపీ నిధులే వృధా అవుతాయి కదా?. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ పిటిషన్ విచారణ అర్హతను పరిశీలిస్తున్నాం. సివిల్ సూట్ ఫైల్ చేస్తేనే సమగ్రంగా విచారణ జరపవచ్చు. ప్రాజెక్టు ఆపాలన్న మీ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వ కమిటీ పరిశీలించేలా చూడమని ఆదేశాలు ఇస్తాం. అలాగే మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి అని అన్నారు.

**ఏకపక్షంగా నిర్మాణం..**

అనంతరం, తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. 'వరద జలాల పేరుతో మాకు కేటాయించిన నీటి వాటాను తరలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ప్రాజెక్టుపై వెంటనే సుప్రీంకోర్టు స్టే ఇవ్వాలి. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీల నీటి వాటా ఉంది. పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్టుతో మా వాటా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను ఏపీ పట్టించుకోవడం లేదు. సీడబ్ల్యూసీ ఛైర్మన్ నేతృత్వంలో ఇటీవల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ప్రాజెక్టును ఆపే అధికారం లేదు. సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టును ఆపాలన్నారు.

**రాష్ట్ర ప్రాజెక్ట్ మాత్రమే..**

మరోవైపు.. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ..'పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టులో మేము నిబంధనలు ఉల్లంఘించలేదు. కేవలం మేము ప్లాన్ రెడీ చేసుకుంటున్నాం. సముద్ర జలాలు వృథా అవుతున్నాయి. వాటిని రాయలసీమకి అందించాలనుకుంటున్నాం. ఇది రాష్ట్ర ప్రాజెక్టు మాత్రమే జాతీయ ప్రాజెక్టు కాదు. మా రాష్ట్ర అవసరాలపైన ప్లానింగ్ చేసుకునే అధికారం ఉంది. మేము పీఎఫ్ఆర్, డీపీఆర్‌లను తయారు చేస్తున్నాము అని తెలిపారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు సూచించిన పరిష్కారాలపై తెలంగాణ ప్రభుత్వం నిర్ణయాన్ని తెలుసుకునేందుకు సమయం ఇవ్వాలని అభిషేక్ సింఘ్వీ కోరారు. అనంతరం, కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా చేశారు.

## ప్రత్యేక యాప్‌ల ద్వారా మోసాలు

-మొదటిపేజీ తరువాయి

నష్టపోతున్నారు. ఆ అప్పులు తీరే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెలుగులోకి వచ్చాయి.

కమలాపూర్ మండలం అంబాలకు చెందిన శ్రీకాంత్ పీజీ చదివాడు. ఫోన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం రూ.13 లక్షల అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక మనస్తాపంతో డిసెంబర్ 25న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత సంవత్సరం జనవరిలో వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు బెట్టింగ్ యాప్‌ల్లో రూ.30 లక్షలు పోగొట్టుకున్నాడు. పోయిన డబ్బు తిరిగి సంపాదించలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ గృహిణి బెట్టింగ్ యాప్‌లో జూదం ఆడి, రూ.2 లక్షలు పోగొట్టుకుంది. కుటుంబ సభ్యులు మందలించడంతో ఆత్మహత్యకు యత్నించింది. ఆసుపత్రిలో చికిత్స అందించడంతో ఆమె బతికింది.

: ప్రస్తుతం ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత జూదం, క్రికెట్, రమ్మీ తదితర బెట్టింగ్ మోసాలు పెరిగాయి. ఈ బెట్టింగ్ కోసం మోసగాళ్లు ప్రత్యేక యాప్‌లను రూపొందించి బెట్టింగులతో యువతకు గాలం వేస్తున్నారు. ఇలా ఆకర్షితులైన వారు బెట్టింగ్ కోసం అప్పులు చేసి ఆస్తులు, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

బెట్టింగ్‌లో భాగంగానే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ విషయానికొస్తే ఇక అంతే సంగతులు. ఈ ఆట 20 ఓవర్ల మ్యాచ్ కావడంతో బంతి, బంతికి లేదా జట్ల గెలుపోటములపై పందెం కాస్తున్నారు. రూ.500 నుంచి రూ.10వేల వరకు బెట్టింగుల్లో పెడుతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా గదులను అద్దెకు తీసుకొని బెట్టింగులు నిర్వహిస్తున్నారు. అలాగే ఇంటర్‌నెట్ సెంటర్లు, నగర శివార్లలో అడ్డాలు ఏర్పాటు చేసుకొని పందేలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు చూసే యువకులను లక్ష్యంగా చేసుకొని ఈ దందా కొనసాగిస్తున్నారు. పందెం కాసిన వారికి మొదట రూ.వందల్లో ఎరగా వేసి ఆకర్షిస్తారు. ఆ తర్వాత రూ.వేలు, రూ.లక్షలు కాజేస్తారు.

"యువత బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి. మొదట డబ్బులు గెలిచినట్లు భ్రమ కల్పిస్తారు. అలవాటు పడిన తర్వాత పదే పదే ఆడాలనిపిస్తుంది. దీంతో అప్పులు తెచ్చి మరీ బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఇబ్బందులు పడతారు." - సీపీఎస్ ఏసీపీ సదయ్య

**ఇలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి :**

క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం, మంచి అలవాట్లు, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలి. కొన్నిసార్లు ఆలస్యం అయినప్పటికీ సత్ఫలితాలు సాధ్యమవుతాయని విశ్వసించాలి.

సులభంగా ఆదాయ వచ్చే మార్గం వైపు మొగ్గుచూపకుండా తమకు తామే నియంత్రించుకోవాలి.

బంధువులు, స్నేహితుల్లో ఎవరైనా ప్రమాదకరంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడటం గుర్తిస్తే పెద్దలకు సమాచారం అందించాలి. అవసరమైతే కౌన్సిలింగ్ ఇప్పించాలి.

బెట్టింగ్ విషయంలో ప్రోత్సహించినట్లు ఎవరైనా మాట్లాడినా, మొబైల్లో సంక్షిప్త సమాచారం, కాల్స్ వచ్చినా పెద్దల దృష్టికి తీసుకెళ్లాలి.

ధర్మఘంట



# హ్యాంగోవర్ తో తలపట్టేసిందా? ఈ టిప్స్ ట్రై చేసి చూడు

కొత్త సంవత్సరం మొదలైంది. అందరూ తమకు నచ్చినట్లుగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. కానీ చాలామంది హ్యాపీగా వెల్కమ్ చెప్పారనే కంటే హ్యాంగోవర్ తో వెల్కమ్ చెప్పారనడం కరెక్టుగా ఉంటుంది. డిసెంబర్ 31 రాత్రి మొదలుపెట్టి అర్ధరాత్రి దాటేంతవరకూ తాగి.. తెల్లవారాక ఆ హ్యాంగోవర్ కు తలపట్టేసి.. దాన్ని ఎలా వదిలించుకోవాలో తెలియక నానా తంటాలు పడుతుంటారు. కొత్త సంవత్సరం, తొలిరోజునే ఇలా హ్యాంగోవర్ తో ఉంటే ఎలా బ్రదర్. పక్కనోడు మంచి చేస్తే ఆదర్శంగా తీసుకోం గానీ.. వాడు తాగాడు,నేను కూడా తాగాలి అని వెంటనే ఫాలో అయిపోతావ్ కదా. ఇప్పుడు ఎంత చెప్పినా గడిచిన రాత్రి తిరిగిరాదు కదా. తలకెక్కిన హ్యాంగోవర్ ను ఎలా వదిలించుకోవచ్చో కొన్ని చిట్కాలు తెలుసుకుందాం. ఇవన్నీ హ్యాంగోవర్ లక్షణాలే.. తలనొప్పి, తల తిరగడం, నోరు ఎండిపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, వాంతులు వచ్చినట్లు ఉండటం.. ఇవన్నీ హ్యాంగోవర్ లక్షణాలే. దీనివల్ల డే అంతా చాలా చిరాకుగా ఉంటుంది. ఆ హ్యాంగోవర్ ను కొన్ని టిప్స్ ద్వారా తగ్గించుకోవచ్చు. ఆల్కహాల్ తీసుకున్నాక శరీరం ఎక్కువగా నీటిని కోల్పోతుంది. సో ఉదయం లేవగానే నార్మల్ వాటర్ లేదా గోరువెచ్చని నీటిని కొద్దికొద్దిగా తాగాలి. దీనివల్ల డీహైడ్రేషన్ తగ్గి, తలనొప్పి వంటి సమస్యల నుంచి రిలీఫ్ ఉంటుంది.

**కొబ్బరినీళ్లు, కాఫీతో రిలీఫ్**

కొబ్బరి నీళ్లు తాగితే ఇంకా మంచిది. వీటిలో ఉండే నాచరల్ ఎలక్ట్రోలైట్స్ శరీరాన్ని త్వరగా ఉత్తేజపరుస్తాయి. కాఫీలో ఉండే_ఫీన్ కూడా మత్తును తగ్గించడంలో యూజ్ అవుతుంది. బట్ ఒక కప్పు కంటే ఎక్కువ కాఫీ తీసుకుంటే డీహైడ్రేషన్ పెరిగే ఛాన్సుంది.

**హ్యాంగోవర్ కు నేచురల్ మెడిసిన్ నిమ్మ**

హ్యాంగోవర్ తగ్గడానికి అందరూ ముందుగా చేసేపని నిమ్మరసం తాగడం. ఇందులో ఉండే విటమిన్ సి ఆల్కహాల్ ప్రభావాన్ని సహాయ పడుతుంది. మజ్జిగలో నిమ్మరసం పిండుకుని తాగినా హ్యాంగోవర్ నుంచి కాస్త రిలీఫ్ పొందొచ్చు.

**వామిట్ సెన్సేషన్ ను తగ్గించే అల్లం**

వికారం, వామిట్ సెన్సేషన్ ను తగ్గించే శక్తి అల్లంకు ఉంది. కొన్ని అల్లం ముక్కల్ని నీటిలో వేసి మరిగించి.. ఆ నీటిని గోరువెచ్చగా తాగాలి. ఎనర్జీ కోసం అరటిపండును తినడం లేదా అరటిపండుతో షేక్ చేసుకుని తాగడం చేయాలి. యాపిల్, అవకాడో వంటి పండ్లు కూడా శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి.

# ఉదయం లేవగానే ఈ 7 తప్పులు చేస్తున్నారా?



మంచి రోజు అనేది మంచి ఉదయంతోనే మొదలవుతుంది. కానీ మనలో చాలామంది లేవగానే చేసే కొన్ని పొరపాట్ల వీఱర్ఘునవం) వల్ల రోజంతా అలసట, నీరసంతో బాధపడుతుంటారు. కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం, మనం రోజూ చేసే 7 చెడు అలవాట్లు మన ఆరోగ్యాన్ని) ఎలా దెబ్బతీస్తున్నాయో ఇప్పుడు చూద్దాం.మొబైల్ చూడటం: కళ్లు తెరిచిన వెంటనే ఫోన్ చూసే అలవాటు చాలామందికి ఉంది. దీనివల్ల మెదడుపై ఒత్తిడి పెరిగి, రోజంతా ఆందోళనగా అనిపిస్తుంది.నీళ్లు తాగకపోవడం: రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవుతుంది. లేవగానే నీళ్లు తాగకపోతే మెటబాలిజం మందగిస్తుంది.పరగడుపున టీ/కాఫీ: ఖాళీ కడుపుతో_ఫిన్ తీసుకోవడం వల్ల ఎసిడిటీ  సమస్యలు వస్తాయి.బ్రేక్‌ఫాస్ట్ మానేయడం: ఉదయం అల్పాహారం తీసుకోకపోతే శరీరానికి కావాల్సిన శక్తి అందక, మెదడు పనితీరు మందగిస్తుంది.అలారం స్నూజ్ చేయడం: పదే పదే అలారం ఆపి పడుకోవడం  వల్ల నిద్ర చక్రం దెబ్బతిని, మరింత బద్ధకంగా తయారవుతారు.వేడి నీళ్ల స్నానం: ఉదయాన్నే మరీ వేడి నీళ్లతో స్నానం చేస్తే శరీరం రిలాక్స్ అయి నిద్రమత్తు వస్తుంది. చల్లని లేదా గోరువెచ్చని నీరే మంచిది.చ్కెర పదార్థాలు: ఉదయాన్నే స్వీట్స్ లేదా ఎక్కువ షుగర్ ఉన్న ఆహారం తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఒక్కసారిగా పెరిగి, అంతే వేగంగా పడిపోతాయి.ఈ చిన్న అలవాట్లను (వీశీతీఅఱఅస్త్ర వీఱర్ఘునవం) మార్చుకుంటే, మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది. ఉదయాన్నే ఆరోగ్యకరమైన అలవాట్లతో రోజును ప్రారంభించండి.

# రీప్రొడక్టివ్ హెల్త్‌ను మెరుగు పరిచే 4 సహజ ఆహారాలు



ప్రస్తుతం అనేక మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో హార్మోన్ల అసమతుల్యత ఒకటి. ఇక పురుషుల్లో లో స్పెర్మ్ ఇష్యూస్, మహిళల్లో అండాలు సక్రమంగా రిలీజ్ కాకపోవడం వంటి ప్రాబ్లమ్స్ పెరుగుతున్నాయి.ఇవి సంతానలేమికి దారితీస్తున్నాయి. అయితే ఈ సమస్య నుంచి బయటపడటంలో సప్లిమెంట్లకంటే సహజ సిద్ధమైన ఆహారాలే మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు అంటున్నారు. అలాంటి వాటిలో గుమ్మడి గింజలు (ూబఎజూౕఅఅ ూవవంం), అరటిపండ్లు, బీట్‌రూట్, ముడి తేనె (తీుఱష ష్ట్రశీఅవవ) వంటివి కూడా ఉన్నాయి. సప్లిమెంట్లు లేకుండానే వీటి ద్వారా బలం, శక్తి, రక్తప్రసరణ, అలాగే రీ ప్రొడెక్టివ్ హెల్త్‌ను మెరుగుపరచవచ్చు. అదెలాగో చూద్దాం.గుమ్మడి గింజలుగుమ్మడి గింజలు (ూబఎజూౕఅఅ ూవవంం) అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు, మెగ్నీషియం, జింక్, ఐరన్, కాపర్, మాంగనీస్, ఫాస్ఫరస్, పొటాషియం, ఫోలేట్ వంటి మినరల్స్, అలాగే ఫైబర్ వంటి పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లు కూడా అందిస్తాయి. వీటిని నానబెట్టి లేదా రోస్ట్ చేసి కూడా తినవచ్చు. సలాడ్స్‌పై చల్లుకోవచ్చు. స్మూతీలు లేదా గ్రానోలాలో కలిపి తీసుకోవచ్చు. లేదా స్నాక్‌గా రోజుకు 1–2 టేబుల్ స్పూన్లు కూడా తినవచ్చు. మొత్తానికి వీటిని ఆహారంగా తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధుల రిస్క్ తగ్గుతుందని, హార్ట్ హెల్త్ మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. అలాగే ఇమ్యూనిటీని పెంచడం, స్పెర్మ్ హెల్త్ అండ్ హార్మోన్ బ్యాలెన్స్‌కు సపోర్ట్ చేయడం, అలసట తగ్గించడంలో కీ రోల్ పోషిస్తాయి.అరటిపండ్లుఅరటిపండ్లు పొటాషియం, విటమిన్ దీ6, విటమిన్ జ, మెగ్నీషియం, ఫైబర్, అలాగే సహజ చ్కెరలు వంటి పోషకాలతో నిండి ఉంటాయి. అలాగే మినరల్స్ అండ్ యాంటీ ఆక్సిడెంట్లు కూడా అందిస్తాయి. వీటిని పండ్లుగా తినవచ్చు. పచ్చిగా ఉన్నప్పుడు కూరగానూ వండుకోవచ్చు. అలాగే స్మూతీలు, మిల్క్ షేక్స్‌లో కలిపి తాగవచ్చు. బేకింగ్‌లో ఉపయోగించవచ్చు. లేదా వర్కౌట్ ముందు ఎనర్జీ స్నాక్‌గా తీసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల విషయానికి వస్తే డైజెస్టివ్ హెల్త్‌ను మెరుగుపరచడం, బ్లడ్ షుగర్ లెవల్స్‌ను సమతుల్యం చేయడం, హార్ట్ హెల్త్ సపోర్ట్, బ్లడ్ ప్రెజర్ నియంత్రణ, వెయిట్ మేనేజ్‌మెంట్, ఇమ్యూనిటీ పెంచడం, అథ్లెటిక్ పెర్ఫార్మెన్స్‌ను మెరుగుపరచడం వంటివి ఉన్నాయి.బీట్‌రూట్స్త్రీ, పురుషుల్లో రీప్రొడక్టివ్ హెల్త్‌ను మెరుగు పర్చడంలో బీట్‌రూట్ కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు (బెటాలైన్స్), నైట్రేట్లు, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, విటమిన్ జ అండ్ మినరల్స్ (ఐరన్, మాంగనీస్) వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. సలాడ్స్‌లో కలపడం ద్వారా, జ్యూస్ రూపంలో, రోస్ట్ లేదా బాయిల్ యడం ద్వారా ఉపయోగించవచ్చు. మల్టిపుల్ మీల్స్‌లో విభజించి తీసుకోవచ్చు. రక్తపోటును నియంత్రించడంలో, అథ్లెటిక్ పెర్ఫార్మెన్స్ మెరుగుపరచడంలో, గుండె, అలాగే జీర్ణశయ ఆరోగ్యాన్ని మెరుగు పర్చడంలో మెదడు సామర్థ్యాన్ని పెంచడంలో, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో బీట్‌రూట్‌లోని పోషకాలు సహాయపడతాయి. రీ ప్రొడక్టివ్ హెల్త్‌ను మెరుగు పరుస్తాయి.ముడి తేనెముడి తేనె (ఝుష ఎశీఅవవ) యాంటీ ఆక్సిడెంట్లు, అమినో ఆసిడ్స్, విటమిన్ సి, బి, ఐరన్, జింక్ వంటి మినరల్స్, ఎంజైమ్స్ అండ్ సహజ చ్కెరలతో నిండి ఉంటుంది. రోజుకు 1–2 టీస్పూన్లు తేనెను టీ లేదా గోరు వెచ్చని నీటితో కలిపి తీసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల విషయానికి వస్తే కఫం, గొంతునొప్పి, గాయం మానడంలో, బ్లడ్ షుగర్ కంట్రోల్లో ఉండటంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పర్చడంలో, ఇమ్యూనిటీని పంచడంలో, ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో ముడితేనె అద్భుతంగా సహాయపడుతుంది.

# ఔషధ నిధి..!

అరటి పువ్వులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి ప్రోస్టేట్ గ్రంధి పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఇందులోని సిట్రిక్ యాసిడ్, అమినో యాసిడ్స్ ప్రోస్టేట్ గ్రంధిని సాధారణ పరిమాణానికి తీసుకువస్తాయి. అరటి పువ్వు నెఫ్రో ప్రొటెక్టివ్ యాక్టివిటీని కలిగి ఉంది. ఇది కిడ్నీ దెబ్బతినకుండా కాపాడుతుంది. అరటి పువ్వుతో చర్మ సమస్యలకు కూడా చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. ఇది యాంటీ హిస్టామైన్ లక్షణాలు కలిగి ఉండటం వల్ల అలెర్జీలు తగ్గించడంలో సహాయపడుతుంది. అరటి పువ్వులో తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అరటి పువ్వులోని టానిన్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, ఆక్సీకరణ నష్టాన్ని తొలగిస్తాయి. తద్వారా గుండె రోగులలో అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటి పువ్వులు ఫైబర్ అధికంగా ఉండి, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది.అరటి పువ్వు రక్తంలో చ్కెర స్థాయిలను తగ్గించే లక్షణాలను కలిగి ఉంది. ఇది నెమ్మదిగా శరీరంలోకి గ్లూకోజ్‌ని విడుదల చేస్తుంది. అదనంగా, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ కూడా మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. అరటి పువ్వులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో రక్త లోపాన్ని తీర్చడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా రక్తహీనతతో బాధపడేవారు దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇందులో ఉండే జింక్ ఎముకల నష్టాన్ని నివారిస్తుంది. ఇందుల్ో్వర్సెటిన్, కాటెచిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఎముకల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. అధిక రక్తపోటు సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి అరటి అద్భుత మేలు చేస్తుంది. అరటి పువ్వును ఆహారంలో భాగంగా చేసుకుంటే.. యాంటీ హైపర్‌టెన్సివ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించగలదు. ఇందులో ఉండే పీచు, యాంటీ ఆక్సిడెంట్లు, అనేక పోషకాలు అనేక ఇతర వ్యాధులకు దివ్యౌషధంగా పనిచేస్తాయి.



ధర్మఘంట

# హరీష్ రావుకు ఊరట

హైదరాబాద్ : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హరీష్ రావుతో పాటు, మాజీ పోలీస్ అధికారి రాధాకిషన్ రావులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం, వాటిని కొట్టివేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో గతంలో ఉన్న ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. వీరిపై చర్యలు తీసుకునేందుకు అనుమతి కోరగా సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి నిరాశే ఎదురైంది.గతంలో ఈ వ్యవహారానికి సంబంధించి దాఖలైన ఇతర పిటిషన్లను కూడా తాము కొట్టివేసిన విషయాన్ని జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యలపై హైకోర్టు గతంలో స్టే ఇవ్వడం లేదా కొన్ని వెసులుబాట్లు కల్పించడం తెలిసిందే. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను తోసిపుచ్చింది.

**ఫోన్ ట్యాపింగ్ కేసు బ్యాక్‌గ్రౌండ్..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు (కాంగ్రెస్, బీజేపీ), వ్యాపారవేత్తలు, కొందరు సెలబ్రిటీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫిర్యాదు రావడంతో తెలంగాణ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ అంశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు వంటి కీలక అధికారులు ప్రధాన నిందితులుగా ఉన్నారు.హరీష్ రావు ప్రమేయంపై ఆరోపణలు: ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకున్నారని హరీష్ రావుపై ప్రభుత్వం ఆరోపణలు చేసింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు విచారించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రయత్నం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని వెనుక కేటీఆర్, కేసీఆర్ లాంటి గత ప్రభుత్వ కీలక నేతలు ఉన్నారని త్వరలోనే నిజాలు బయట పెడతామని కాంగ్రెస్ నేతలు, రాష్ట్ర ప్రభుత్వం అంటోంది.హైకోర్టు స్టే: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రక్రియలో భాగంగా కొందరిపై ప్రస్తుతానికి చర్యలు తీసుకోకుండా తెలంగాణ హైకోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు సైతం హైకోర్టు తీర్పును గౌరవిస్తూ తెలంగాణ సర్కార్ పిటిషన్లను కొట్టివేసింది. దాంతో ఈ కేసులో హరీష్ రావు, రాధాకిషన్ రావులకు ప్రస్తుతానికి ఊరట లభించింది. గతంలోనూ ఈ కేసుకు సంబంధించి దాఖలైన పిటిషన్లను తాము కొట్టివేశామని విచారణ సందర్భంగా నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది.



# మర్పడగ గ్రామంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పలు పర్యటనలు

సిద్దిపేట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెను ప్రకారం కిచిడీ, కూర, గుడ్డు వండినట్లు సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో ఆహారం బాగుందా రుచిగా వండుతున్నారా అని ఆప్యాయంగా పలకరించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు క్రమశిక్షణ తో చదువు నేర్పించాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. అసంపూర్తిగా ప్రహరీ గోడ, టాయిలెట్స్ నిర్మాణం ఉన్నాయని ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తేగా సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ టాయిలెట్స్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు.గ్రామంలోని పల్లెదవాఖనా ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. దవాఖాన మొత్తం కలియ తిరిగారు. లోపల చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. రిజిస్టర్ లు తనికి చేశారు. గ్రామంలోని ప్రెగ్నెన్సీ మహిళల టిబి, షుగర్ పేషంట్ లను తరుచు మానిటర్ చెయ్యాలని తెలిపారు. గ్రామంలో శానిటేషన్ డ్రైవ్ ను పరిశీలించారు. మోరీలలో చెత్త చెదారం ఉండి నీటి నిల్వలు చూసి అసహనం వ్యక్తం చేశారు. నీటి నిల్వలలో దోమలు రావడం వలన అంటువ్యాధులకు కేంద్రంగా ఉంటాయని వారం లోపు గ్రామం మొత్తం శానిటేషన్ డ్రైవ్ పూర్తి చెయ్యాలని పంచాయతీ కార్యదర్శి ను ఆదేశించారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య 55**

జగిత్యాల : ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ లు, ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 55 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి.ఎస్ లత, బి. రాజ గౌడ్, మెట్ పెల్లి ఆర్డీవో ,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

**జనాభా ప్రాతిపధికన రిజర్వేషన్లు కల్పించాలి**

**ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారిలో అలసత్వం వద్దు**

**ప్రజావాణిలో కలెక్టర్ కు ఓసి జేఏసీ నాయకుల వినతి**

జగిత్యాల : అగ్ర వర్ణాలోని పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనీ ఓసి జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు ఓ.సి.జెఏసీ నాయకులు ఓ.సి వర్గాలకు సంబంధించిన పలు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని సోమవారం ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.ఈనెల 11 న వరంగల్ లో నిర్వహించనున్న ఓసి ల సింహ గర్జన సభను విజయవంతం చేయాలనీ కోరుతూ జగిత్యాల వైశ్య భవన్ లో ఓసి నాయకుల సన్నాహాక సమావేశం నిర్వహించి అనంతరం నాయకులు కలెక్టరెట్ కు వెళ్లి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఓసి జేఏసీ నాయకులు ఎన్నం కిషన్ రెడ్డి, అయిల్నేని సాగర్ రావు, మహంకాళి రాజన్న, సిరిసిల్ల రాజేందర్ శర్మలు మాట్లాడుతూరాష్ట్ర ,జాతీయ స్థాయిలో ఓ.సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.ఓ.సి కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలనీ వారు డిమాండ్ చేశారు.ఓ.సి వర్గాలకు జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా జనరల్ స్థానాల్లో ఓసి అభ్యర్థులే పోటీచేసేలా రాజ్యాంగ సవరణ చేయాలనీ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఓసిల్లోని ప్రతి విద్యార్థికి విద్య, ఉద్యోగాల్లో సహాయం పడేలా ఉండాలన్నారు.ఓ.సి వర్గాలకు చెందిన 10 శాతం ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ల జారిలో జగిత్యాల జిల్లాలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, నిబంధనల మేరకు వెంటనే జారీ చేయాలనీ కలెక్టర్ ను కోరారు.సమావేశంలో నాయకులు దేవరాశెట్టి జనార్దన్,మోతే ఉమాపతి శర్మ, ప్రసాద్ రావు, బండ పెల్లి చంద్రశేఖర్, రేణికుంట శ్రీనివాస్, అక్కెనపల్లి కాశినాథం, అయిల్నేని స్వప్న, వెంకటేశ్వర్ రావు, సిరిసిల్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




## మార్కెట్ ను ముంచెత్తుతున్న నకిలీలలు

మహబూబ్ నగర్ : మార్కెట్లో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అత్యుత్తమ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి వస్తున్న వంట నూనెలను ప్రజలు వినియోగిస్తూ అస్వస్థతను కొనితెచ్చుకుం టున్నారు. సాధారణ పప్పులు, ఇతర పదార్థాలతో పాటు వంట నూనెలను కూడా కల్తీ చేస్తున్నారు. గజ్వేల్ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన వంట నూనెలను కల్తీ చేస్తూ వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధిక లాభాలను ఆర్జించడానికి నూనెలలో ఇతర నూనెలు పదార్థాలు కలుపుతూ కల్తీ చేయడమే కాకుండా ప్రముఖ కంపెనీల కవర్లను ముద్రించి వాటి ద్వారా కల్తీ వంట నూనెలను విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ఓ ప్రముఖ కంపెనీ పేరుతో ప్రచారంలో ఉన్న పొద్దు తిరుగుడు విత్తనాలతో తయారు చేసిన వంట నూనెలను పత్తి గింజల నూనెతో కలిపి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ నూనెను సాధారణంగా వంటలకు విక్రయించిన సమయంలో ఎలాంటి తేడా కనిపించడం లేదు. మాంసాహారం కానీ, తిను బండారాలు కానీ ఎక్కువగా వేయించిన వ్పుడు ఆ పదార్థాలు, నూనె కూడా పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తున్నాయి. కొనుగోలుదారులు కిరాణా దుకాణం యజమానులను అడిగిన సందర్భంలో డీలర్ ను సంప్రదించాలని సూచిస్తున్నారు.సంబంధిత డీలర్లు మాకు ఎలాంటి సంబంధం లేదంటూ, నూనె ప్యాకెట్లపై ఉండే కంపెనీ అడ్రస్ ను సంప్రదించాలని సూచిస్తూ చేతులెత్తేస్తున్నారు. సదరు కంపెనీ వంటనూనె పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తుందని డీలర్ ని వివరణ కోరగా పత్తి గింజల నూనె కలపడానికి ప్రభుత్వాలే అనుమతులు ఇస్తున్నట్లు వెల్లడించడం గమనార్హం. వంటనూనె ( పొద్దు తిరుగుడు గింజల నూనె) కల్తీ విషయంలో జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో పూర్వ అధికారులను సంప్రదించగా అసలు విషయం బయట పెట్టారు. వేర్వేరు గింజల నూనెను కలిపి వంట నూనెగా విక్రయించడానికి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వదని వారు వెల్లడించారు. ప్రతి వంటనూనె ప్యాకెట్లపై ఏయే పదార్థాలు వంట నూనె తయారీకి వినియోగిస్తారో వివరాలు రాసి ఉంటాయని చెప్పారు.అంటే డీలర్లు కూడా ఈ విషయంలో వాస్తవాలను దాచిపెడుతున్నట్లు అధికారుల మాటల ద్వారా తేటతెల్లం అవుతుంది. గజ్వేల్ ప్రాంత అధికారులతో పాటు, జిల్లా స్థాయి అధికారులు సైతం మామూళ్ల మత్తులో తనిఖీలు చేపట్టకపోవడంతో కల్తీ వంట నూనెను వినియోగిస్తూ ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రముఖ కంపెనీ వంటనూనె కల్తీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పొగ మంచులో ప్రయాణం, జాగ్రత్తలు తప్పనిసరి:

**ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్**

సిద్దిపేట : ప్రయాణాలు ఎంత ముఖ్యమో వాహనదారులు నిబంధనలు పాటించడం కూడా అంతే ముఖ్యం వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి.ప్రజల భద్రతే పోలీస్ లక్ష్యంరహదారుల వెంట పోలీస్ నిరంతర పెట్రోలింగ్.నిభందనలు పాటించడం, ముందు జాగ్రత్తలు తీసుకోవడం తో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు.సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్..చలికాలం సందర్భంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిందని పొగమంచు పడే వేళల్లో రాత్రిళ్ళు, తెల్లవారు జామున వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని, పొగమంచు ప్రభావం వల్ల రహదారులపై ముందు ఉన్న వాహనాలు కనిపించకపోవడం వలన ప్రమాదలు జరిగే అవకాశం ఉందన్నారు. చలిలో ప్రయాణం కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురి కావచ్చు కావున వాహనదారులు రోడ్లపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట నిరంతర పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నం, వాహనదారులు లైటింగ్ కండిషన్ చూసుకోవాలి, తక్కువ వేగంతో డ్రైవ్ చేయాలి, మ్యూజిక్ పెట్టుకోవద్దు, ఓవర్ టేక్ చేయొద్దు, కచ్చితమైన మార్గంలో ఒకే లైన్ లో వాహనం నడపాలి, పదే పదే లైన్ క్రాస్ చేయొద్దు, ఇండికేటర్ ను వెయ్యాలి, వాహనాల మధ్యలో దూరం పాటించాలి, హారన్స్, వాహన శబ్దాలను గుర్తించాలి, ఇతర వాహన డ్రైవర్ లను ఇబ్బంది పెట్టకుండా వెళ్ళాలి, రోడ్లపై పరిస్థితులు గమనించాలి అని కోరారు. సురక్షితంగా ప్రయాణించి గమ్యం చేరుకావాలని విజ్ఞప్తి చేశారు.ద్విచక్ర వాహనదారులు: తీసుకోవాల్సిన జాగ్రత్తలు.హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.హై-బీమ్ వాడకండి, లో-బీమ్ లైట్లు మాత్రమే ఉపయోగించాలి.వేగం తగ్గించి ముందున్న వాహనానికి సురక్షిత దూరం పాటించాలి.రిఫ్లెక్టివ్ జాకెట్లు, స్టిక్కర్లు వాడుకోవాలి.సడన్ బ్రేకులు వేయకుండా జాగ్రత్త పడాలి రోడ్డు తడిగా ఉంటే స్కిడ్ అయ్యో ప్రమాదం ఉంది.టర్నింగ్ అయ్యో ముందు ఇండికేటర్ ఇవ్వాలి.రాత్రి తెల్లవారుజామున ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, ఈ సమయాల్లో పొగమంచు తీవ్రత ఎక్కువ.గ్లౌవ్స్ తప్పనిసరిగా ధరించాలి చేతులు చల్లబడితే వాహన నియంత్రణ తగ్గుతుంది.కార్లు, పెద్ద వాహనాల డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:ఫాగ్ ల్యాంప్స్ లేదా లో-బీమ్ లైట్లు మాత్రమే వాడాలి.వేగం తగ్గించి నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలి.ముందున్న వాహనానికి సాధారణ దూరం కంటే 3-4 రెట్లు ఎక్కువ దూరం ఉంచాలి.4 డిఫాగర్ ఉపయోగించాలి విండోలను కొద్దిగా ఓపెన్ చేసి ఫాగింగ్ నివారించాలి.హాజర్డ్ లైట్లు విజిబిలిటీ తక్కువగా ఉన్నప్పుడు వాడాలి.పొగమంచు లేదా కర్వ్ ప్రాంతాల్లో ఓవర్‌టేక్ చేయవద్దు.లైన్ మార్కింగ్‌లు, రోడ్ రిఫ్లెక్టర్లను గమనిస్తూ నడపాలి.వైపర్స్, లైట్లు, బ్రేకులు సరిగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలి.సడన్ బ్రేకులు లేదా మలుపులు వద్ద వేగాన్ని నివారించాలి.ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ముందుగానే ప్రయాణం ప్రారంభించండి, తొందరపడొద్దు. హెడ్లైట్లు శుభ్రంగా ఉంచండి. రోడ్డు సూచనలు, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించండి. విజిబిలిటీ చాలా తక్కువగా ఉంటే, సురక్షిత ప్రదేశంలో ఆగి వేచి ఉండండి ట్రాఫిక్ ఏసిపి ఎస్ సుమన్ కుమార్ అన్నారు.

## వారం,10 రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్

**మంత్రులు,ఎమ్మెల్యేలను అలర్ట్ చేసిన సీఎం,పీసీసీ చీఫ్.?**

హైదరాబాద్ : ఎలక్షన్స్‌కు సిద్ధం కావాలని దిశానిర్దేశంపెండింగ్ పనులను పరిష్కరించాలని సూచనప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు పూర్తి చేయాలని ఆదేశం.మరో వారం, పది రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని మంత్రులు,పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను సీఎం రేవంత్‌రెడ్డి,పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అలర్ట్ చేశారు.ఈ లోపే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.గత నాలుగైదు రోజులుగా తమను కలిసిన మంత్రులు,ఎమ్మెల్యేలు,పార్టీ నేతలకు సీఎం,పీసీసీ చీఫ్ పలు సూచనలు చేస్తూ. వారిని అప్రమత్తం చేస్తున్నారు.సిటీలో,పట్టణాల్లో గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయడంపై స్థానిక ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలని సూచించారు. మంత్రులు కూడా దీనిపై దృష్టిపెట్టి పార్టీ ఎమ్మెల్యేలు, నేతల నుంచి వస్తున్న ఇలాంటి సమస్యలపై వెంటనే నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మెజార్టీ వార్డులను దక్కించుకోవాలి:మున్సిపాలిటీల పరిధిలో పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని,చేపట్టాల్సిన పనులకు శంకుస్థాపనలు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం,పీసీసీ చీఫ్ సూచించారు. సిటీ,పట్టణ ప్రజల నుంచి వస్తున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యేలు,పార్టీ నేతలు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్లు,వార్డుల్లో రోడ్లు,డ్రైనేజీలు,స్ట్రీట్ లైట్లు, శానిటేషన్,నల్లా నీళ్లు..ఇలా ప్రజలను నిత్యం ఇబ్బందులు పెడుతున్న సమస్యలను త్వరితగతిన గుర్తించి, పరిష్కరించాలని సూచించారు.పార్టీ ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ పరిధిలోని పట్టణాలపై ఈ వారం,పది రోజులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, డివిజన్లలో, వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రతి కార్పొరేషన్,మున్సిపాలిటీలో మెజార్టీ వార్డులను కాంగ్రెస్ దక్కించుకునేలా ఇప్పటి నుంచే ఇటు పార్టీ బలోపేతంపై,అటు ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని మంత్రులు, ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలను సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కోరారు.పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను మించి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీట్లు రావాలన్నారు. ఈ ఫలితాల ఆధారంగానే రాబోయే రోజుల్లో నేతల రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే పరోక్ష సంకేతాలను ఇచ్చినట్టు సమాచారం.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

కరీంనగర్ : ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 299 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 68, హౌసింగ్ శాఖకు సంబంధించి 43 దరఖాస్తులు వచ్చాయి.

## బిజినెస్

### భారీగా తగ్గిన వెండి

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతున్నాయనే సంకేతాల నేపథ్యంలో వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. సోమవారం ఎంసిఎక్స్ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.21 వేలు తగ్గింది. మధ్యాహ్నం తర్వాత ఒక్క గంటలోనే కిలో వెండి ధర భారీగా తగ్గి రూ.2,33,120 కు చేరింది. ముఖ్యంగా ఉక్రయిన్–, రష్యా యుద్ధానికి సంబంధించి సానుకూల పరిణామాలు కనిపించడంతో పెట్టుబడిదారుల్లో లాభాల స్వీకరణ కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ఉండటంతో సురక్షత పెట్టుబడిగా భావించే వెండిపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఇటీవల వెండి కిలోకు రూ.2,54,174 వద్ద ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. దీని తర్వాత చోటుచేసుకున్న భారీ పతనం ఇదే కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపించాయి. సోమవారం ప్రారంభంలో వెండి ధర ఔన్సుకు తొలిసారిగా 80 డాలర్లని దాటింది. అయితే లాభాల స్వీకరణ కారణంగా ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి తగ్గింది. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా వెండిపై పెట్టుబడిదారుల ఆసక్తి ఇంకా కొనసాగుతోంది. ఇదే సమయంలో బంగారం ధరలు కూడా ఎంసిఎక్స్‌లో ఫిబ్రవరి 2026 డెలివరీ ధర 10 గ్రాములకు రూ.1,40,230కు చేరింది. అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు

### ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు



కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శనివారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబందిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్ధిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్ధవంతమైన రీ ఛార్జింగ్‌కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రెసిబులిటి) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది. ముసాయిదా అమలులోకి వస్తే బ్యాటరీల ఉత్పత్తిదార్లు లేదా దిగుమతిదార్లు తప్పనిసరిగా వీటికి 21 అంకెల బ్యాటరీ ప్యాక్ ఆధార్ నెంబరు అంటే బిపిఎఎన్‌ను తప్పనిసరిగా పొందుపర్చుకోవల్సి ఉంటుంది. లేకపోతే ఇటువంటి బ్యాటరీలు ఉనికిలోనికి రావడానికి వీలుండదు. బిపిఎఎన్ అధికారిక పోర్టల్‌లో సంబంధిత బ్యాటరీ ప్యాక్ డైనమిక్ డేటాను జతచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు బ్యాటరీల ఉత్పత్తిదార్లకు ఈ నిబంధన తప్పనిసరి చేస్తారు. మార్కెట్‌లోకి పంపే ప్రతి బ్యాటరీకి ఈ నెంబరు నిర్ధిష్టంగా ఉండటంతో వాటిని గుర్తించేందుకు వీలేర్పడుతుంది. రీసైక్లింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందని అధికార వర్గాలు తమ ప్రకటనలో తెలిపాయి.

### భారత్ నుంచి 50 బిలియన్ డాలర్ల ఐఫోన్ల ఎగుమతితో రికార్డు!

భారతదేశం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో కొత్త చరిత్ర సృష్టించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ద్వారా యాపిల్ ఐఫోన్ల ఎగుమతులు భారీ మైలురాయిని చేరుకున్నాయి. గత ఐదేళ్లలో భారత్ నుంచి ఏకంగా 50 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.15 లక్షల కోట్లు) విలువైన ఐఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లోనే (ఏప్రిల్–డిసెంబర్ 2025) దాదాపు 16 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను యాపిల్ ఎగుమతి చేసింది. భారత్ నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం స్మార్ట్‌ఫోన్లలో 75 శాతం వాటా ఐఫోన్లదే కావడం విశేషం. ఈ విజయంతో మొబైల్ తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరింది. ప్రస్తుతం దేశంలో టాటా గ్రూప్‌కు చెందిన మూడు ప్లాంట్లు, ఫాక్స్‌కాన్‌కు చెందిన రెండు ప్లాంట్లలో ఐఫోన్ల తయారీ జరుగుతోంది. ఎగుమతులే కాకుండా దేశీయ మార్కెట్లోనూ యాపిల్ సత్తా చాటుతోంది.

# సానుకూలతలున్నా.. అప్రమత్తతే

దేశీయ స్టాక్ మార్కెట్లలో, సమీప భవిష్యత్తులో సానుకూలతలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్–అమెరికా ఒప్పందం మరింత ఆలస్యమైతే, రూపాయి బలహీనపడొచ్చు. బుధవారం వెలువడే తొలి ముందస్తు జీడీపీ (2025–26) అంచనాల కోసం మదుపర్లు ఎదురు చూస్తున్నారు. 2026లో ఈక్విటీ మదుపర్లకు మెరుగైన ప్రతిఫలాలే కనిపించొచ్చని, అయితే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈనెల తొలి 2 రోజుల్లోనే రూ.7,608 కోట్ల విక్రయాలు జరపడం గమనార్హం. గతేడాది తరహాలోనే ఈ ఏడాదిలోనూ నిఫ్టీ–50 లాభాలు ఉండొచ్చని, కార్పొరేట్ ఫలితాలు బాగుంటే, మరింత ప్రతిఫలం లభిస్తుందని ఓ బ్రోకరేజీ అంటోంది. ఈనెల 12న టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు వెల్లడి కానున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు ఇలా..ఆర్థిక ఫలితాలకు ముందు ఈవారం నిఫ్టీ బ్యాంక్ రాణించొచ్చు. దీనికి 59,800–59,500 వద్ద కీలక మద్దతు ఉంది. 60,500–60,700 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. 59,500 దిగువన లాంగ్ పొజిషన్ల నుంచి ట్రేడర్లు బయటకు వచ్చే అవకాశం ఉన్నందున, సెంటిమెంటు బలహీనపడొచ్చు.లోహ కంపెనీల షేర్లు మరిన్ని లాభాలు అందించొచ్చు. కేంద్ర విధానాలు, స్థూల ఆర్థిక అంశాలు కలిసిరావొచ్చు. ‘పడినపుడల్లా కొనుగోలు చేయడం’ మంచి పద్ధతి అవుతుంది. స్వల్పకాలంలో నిఫ్టీ లోహ సూచీ సానుకూలంగానే కనిపిస్తోంది. ఓవర్‌బాట్ పరిస్థితుల వల్ల తక్కువ శ్రేణిలో



కదలికలుండొచ్చు.టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా షేరుకు కొంత విక్రయాల ఒత్తిడి ఉండొచ్చు. ఏజీఆర్ బకాయిల విషయంలో లభించిన ఊరట ప్రభావం పెద్దగా కనిపించకపోవచ్చు. రూ.6 లక్ష్యంతో ఈ షేరును విక్రయించొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది. భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.2,140 వద్ద నిరోధం, రూ.2,000 వద్ద మద్దతు కనిపిస్తోంది.చమురు–గ్యాస్ కంపెనీల షేర్లు సమీప కాలంలో సానుకూల ధోరణిలో చలించొచ్చు. నిఫ్టీ ఆయిల్–గ్యాస్ సూచీకి 12,100–11,950 వద్ద మద్దతు, 12,600–12,700 వద్ద నిరోధం కనిపిస్తోంది. ఫలితాలకు ముందు యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ప్రధాన కంపెనీలన్నీ బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేయొచ్చు. అయితే ఆర్డర్ల రాక తగ్గడం, షేర్ల అధిక ధరల కారణంగా ఈ రంగ షేర్లకు విక్రయాల ఒత్తిడి ఏర్పడొచ్చు.వాహన కంపెనీల షేర్లు రాణించొచ్చు. రిటెయిల్ గిరాకీ కొనసాగుతుండడం, ఎగుమతులు బాగుండడం ఇందుకు నేపథ్యం. షేర్ల ధరలు అధికంగా ఉన్నా, ఫలితాలు బాగుంటాయన్న అంచనాల మధ్య కాస్త పెరగొచ్చనే భావిస్తున్నారు.కొంత స్తబ్దత తర్వాత విలువలు పుంజుకుంటుండడంతో, ఐటీ షేర్లు లాభాలు అందుకోవచ్చు. ఫెడ్ వడ్డీ రేటు కోతల అనంతరం క్లయింట్ల వ్యయాలు పెరగొచ్చన్న అంచనాలకు తోడు, ఏఐ ఆధారిత సేవలకు గిరాకీ పెరుగుతుండడం కలిసిరావొచ్చు. ఈ నెలలో సిమెంటు ధరలు పెరగొచ్చన్న అంచనాల మధ్య సిమెంటు రంగ షేర్లు మెరవవచ్చు. దక్షణాది రాష్ట్రాల్లో 50 కిలోల బస్తా ధర రూ.20–30 వరకు పెరగొచ్చని హైదరాబాద్‌కు చెందిన ఒక సిమెంటు తయారీ కంపెనీ అంటోంది.ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. ఈ సూచీ 54,000 – 57,500 స్థిరీకరణ శ్రేణిలో, దిగువ స్థాయి కంటే కిందకు రావడం ఇందుకు నేపథ్యం. సిగరెట్లపై ఎక్సైజ్ సుంకం విధించడంతో ఐటీసీ షేరు 2023 ఫిబ్రవరి తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయి(రూ.350.05)కి చేరింది.ప్రభావం చూపే వార్తలు లేనందున ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. త్రైమాసిక ఫలితాల కారణంగా రాబోయే వారాల్లో ఎంపిక చేసిన ఫార్మా షేర్లు కాస్త పెరగొచ్చు.

# జొమాటో సీఈఓ చెప్పింది తప్పు..!

గిగ్‌వర్కర్లకు గౌరవమైన వేతనం, ప్రోత్సాహకాలు దక్కుతున్నాయని జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ చెప్పేది తప్పని గిగ్ వర్కర్ల యూనియన్లు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీపిందర్ గోయల్ తన కంపెనీకి చెందిన తాత్కాలిక ఉపాధి విధానం ‘గిగ్ మోడల్’ ను సమర్థించుకుంటూ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ అసోసియేషన్ (డీజీపీడబ్ల్యూఏ) తప్పుబట్టింది. డెలవరీ కార్మికుల ప్రస్తుత పని పరిస్థితులు ఏమాత్రం గౌరవప్రదంగా లేవని ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో భారతదేశంలో వేగంగా పెరుగుతోన్న క్విక్ కామర్స్, డెలివరీ కార్మికుల ప్రయోజనాలపై దీపిందర్ గోయల్, గిగ్‌వర్కర్ల యూనియన్ల మధ్య జరుగుతున్న చర్చ తీవ్ర వేడెక్కినట్లయ్యింది.”జొమాటోలో 2025లో డెలివరీ పార్ట్‌నర్ సగటు వేతనం రూ.102గా ఉంది. 2024లో ఇది రూ.92గా నమోదయ్యింది. డెలివరీ భాగస్వాములు ఒకవేళ రోజుకు 10 గంటలు చొప్పున నెలలో 26 రోజులు పనిచేసినా ఒక్కో డెలివరీ ఏజెంట్ రూ.26,500 ఆర్జించొచ్చు. అందులోంచి పెట్రోల్, నిర్వహణ ఖర్చులు మినహాయించినా రూ.21,000 వస్తుంది. దీనికి టిప్ అదనం. ఫుల్ టైమ్ వర్క్‌కు ప్రత్యామ్నాయంగా గిగ్ వర్క్ మోడల్ రూపుదిద్దుకుంది. ఉద్యోగితో సమానంగా ప్రయోజనాలు, స్థిరమైన




వేతనాలు కోరడం ఈ మోడల్‌కు ఏమాత్రం సరిపోదు.” అని దీపిందర్ గోయల్ వ్యాఖ్యలు చేశారు.దీపిందర్‌కు యూనియన్ల కౌంటర్..దీపిందర్ గోయల్ వ్యాఖ్యలను గిగ్ వర్కర్ల యూనియన్ సవాల్ చేసింది. క్షత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని డీజీపీడబ్ల్యూఏ తెలిపింది. ”పెట్రోల్, వాహన నిర్వహణ ఖర్చులను తీసివేస్తే వాస్తవానికి గంటకు నికరంగా రూ.81 మాత్రమే వస్తుంది. దీని ప్రకారం.. నెలకు 26 రోజులు, రోజుకు 10 గంటల చొప్పున కష్టపడి పనిచేసే వ్యక్తికి సుమారు రూ.21,000 మాత్రమే లభిస్తుంది. డెలివరీ భాగస్వాములకు వేతనంతో కూడిన సెలవులు (పెయిడ్ లీవ్స్), సామాజిక భద్రత లేదా గ్యారెంటీ ఉన్న ప్రమాద బీమా లేవు. గోయల్ చెప్పిన అదనపు ఆదాయం చాలా పరిమితం. కేవలం 5 శాతం ఆర్డర్లకు మాత్రమే టిప్స్ వస్తున్నాయి.” అని డీజీపీడబ్ల్యూఏ ఎత్తి చూపింది.డెలివరీ భాగస్వాములకు సామాజిక భద్రతతో పాటు ప్రోత్సాహకాలు కల్పించాలని, 10 నిమిషాల్లో డెలివరీ టార్గెట్ లాంటి పని ఒత్తిడిని తగ్గించాలనే డిమాండ్‌లతో ఇటీవల ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మె చేపట్టాయి. డిసెంబర్ 25న, 31న రెండు రోజుల పాటు దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మె పిలుపునతో ఫుడ్ యాప్‌లకు ఝలక్ ఇచ్చిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండటంతో వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు స్వల్ప ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయి. తాజాగా గిగ్‌వర్కర్లు మళ్లీ ఆందోళనకు సంకేతాలు ఇవ్వడం విశేషం.

# ఐసీసీకి కొత్త తలనొప్పి.. టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాల్సిందేనా!

టీ20 ప్రపంచకప్ నిర్వహణకు సిద్ధమవుతున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి(×జజ)కి కొత్త తలనొప్పి మొదలైంది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మెగా టోర్నీ ప్రారంభం కానుండగా.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బాంబ్ పేల్చింది. ఐపీఎల్ నుంచి పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తొలగించడానికి ప్రతిచర్యగా, భారత్‌లో ప్రపంచకప్ ఆడమని బంగ్లా తేల్చి చెప్పేసింది. దాంతో.. ఇదివరకే ప్రకటించిన షెడ్యూల్‌ను మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై హత్యాకాండ తదనంతర పరిణామాలు క్రికెట్‌పై పడ్డాయి. అల్లర్లతో అట్టుడుకుతున్న బంగ్లాతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసిన భారత్.. క్రికెట్ సంబంధాల్ని కూడా కట్ చేసింది. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ (వీబర్ఖుటఅఓబతీ =వంప్త్రఖుఅ)ను తొలగించింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వరల్డ్‌కప్ ఆడేందుకు తమ జట్టును ఇండియాకు పంపమని ఐసీసీకి ఈ–మెయిల్ చేసింది. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా తమ టీమ్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని కోరింది. దాంతో.. ఇప్పటికే షెడ్యూల్ వెలువరించి ప్రపంచకప్ నిర్వహణపై కసరత్తు చేస్తున్న ఐసీసీ ఆలోచనలో పడింది. బంగ్లా బోర్డు విజ్ఞప్తిని




పరిశీలిస్తున్న జై షా నేతృత్వంలోని ఐసీసీ త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసింది. అంతేకాదు కోల్‌కతా నైట్ రైడర్స్ ఇటీవలవేలంలో రూ.9.1 కోట్లు పలికిన బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కొనడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. అతడిని స్క్వాడ్ నుంచి తప్పించాలని బీసీసీఐ ఆదేశించింది. జనవరి 4 ఆదివారం సమావేశమైన బోర్డు సభ్యులు ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించిన బీసీసీఐని తప్పుపట్టారు. భద్రతా కారణాలతో భారత్‌కు తమ జట్టును పంపమని బోర్డు వెల్లడించింది. ‘భద్రతా కారణాల రీత్యా మా జట్టును ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపించడం సాధ్యం కాదు. బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. బీసీసీఐ నిర్ణయానికి కౌంటర్‌గా మేము ఈ తీర్మానం చేశాం. మా జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించండి’ అని బంగ్లా క్రికెట్ బోర్డు ఆదివారం ఐసీసీకి పంపిన ఈ–మెయిల్‌లో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బంగ్లాదేశ్, వెస్టిండీస్ తలపడాలి. కానీ, బంగ్లా బోర్డు విన్నపం నేపథ్యంలో ఆ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించడంపై ఐసీసీ ఆలోచిస్తోంది. టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : లిటన్ కుమార్ దాస్(కెప్టెన్), మొహమ్మద్ సైఫ్ హొసేన్(వైస్ కెప్టెన్), తంజిద్ హసన్, పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొసేన్, కాజీ నురుల్, మహేది హసన్, రిషద్ హొసేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తంజిమ్ హసన్, తస్కిన్ అహ్మద్, షైఫుద్దీన్, షోరిఫుల్ ఇస్లాం.

## భారీ శతకంతో విరుచుకుపడిన రూట్.. ఆస్ట్రేలియాను ఆదుకున్న హెడ్..!

యాషెస్ సిరీస్‌లో చివరిదైన సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా దీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్(160) భారీ శతకంతో ఇంగ్లండ్ సవాల్ విసిరినా.. పేసర్ నెసెర్(4–60) విజృంభణతో ప్రత్యర్ధిని నాలుగొందల లోపే కట్టడి చేసింది. అనంతరం ట్రావిస్ హెడ్(91 నాటౌట్) విధ్వంసక అర్ధశతకం బాదేయగా.. మార్నస్ లబూషేన్(48) క్రీజులో నిలబడ్డాడు. వీరిద్దరి జోరుతో పటిష్ట స్థితిలో నిలిచిన స్మిత్ సేన తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 218 పరుగులు వెనకబడి ఉంది సిడ్నీ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ భారీ స్కోర్ చేయగా.. ఆస్ట్రేలియా కూడా తగ్గేదేలే అన్నట్టుగా ఆడుతోంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్(91 నాటౌట్) మెరుపు అర్ధ శతకంతో ఆసీస్ పుంజుకుంది. రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది ఆతిథ్య జట్టు. అంతకుముందు దాంతో.. ఓవర్‌నైట్ స్కోర్




211–3తో రెండో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన పర్యాటక జట్టు 384కే ఆలౌటయ్యింది. మిడిలార్డర్ క్రీజులో పాతుకుపోవడంతో తొలిసారి ఆలౌట్ గండం తప్పించుకున్న ఇంగ్లండ్‌ను నెసెర్(4–60) దెబ్బకొట్టాడు. జో రూట్(160), వికెట్ కీపర్ జేమీ స్మిత్(46)ల మెరుపులతో నాలుగొందల దిశగా వెళ్తున్న పర్యాటక జట్టు తోకను ఈ ఆసీస్ పేసర్ కత్తిరించాడు. ఇద్దరు నిలబడడంతో.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్, హ్యారీ బ్రూక్ ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు.

## స్పోర్ట్స్

### ముంబై కెప్టెన్‌గా అయ్యర్.. పునరాగమనం అదిరేనా..!




స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన శ్రేయాస్ అయ్యర్ మైదానంలోకి దిగనున్నాడు. అది కూడా కెప్టెన్‌గా. ఈమధ్యే కోలుకున్న అయ్యర్ దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ సారథిగా ఎంపికయ్యా. వన్డే ఫార్మాట్లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో తదుపరి మ్యాచ్‌లకు అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సోమవారం ముంబై క్రికెట్ సంఘం తెలిపింది. సిడ్నీ వన్డేలో గాయంతో ఆటకు దూరమైన శ్రేయాస్ అయ్యర్.. సర్జరీ తర్వాత వేగంగా కోలుకున్నాడు. ఇటీవలే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ చాటుకొని న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. అయితే.. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ చాటుకుంటేనే జాతీయ జట్టుకు ఆడే అవకాశం ఉన్నందున దేశవాళీ టోర్నీలో ఆడేందుకు సిద్ధమయ్యాడీ స్టార్ బ్యాటర్. సీనియర్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ఒగాయపడడంతో అయ్యర్‌కు ముంబై సారథ్యం అప్పగించింది. ‘ముంబై సీనియర్ టీమ్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ నియమితులయ్యాడనే విషయాన్ని మీతో పంచుకోవడం సంతోషంగా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై అయ్యర్ సారథ్యంలోనే తదుపరి మ్యాచ్‌లు ఆడనుంది’ అని ఎంసీఏ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం గ్రూప్ సీ నుంచి రెండో స్థానంలో ఉంది. జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో, జనవరి 8న పంజాబ్‌తో ముంబై తలపడనుంది.

**జనవరి 11న బరోడాలో**

రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో, ఆపై ఛాంపియన్స్ ట్రోఫీలో మెరిసిన అయ్యర్‌ను న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు తీసుకున్నారు. రెగ్యులర్ సారథి శుభ్‌మన్ గిల్ (రాష్ట్రబఎఝఅ +అశ్రీశ్రీ) నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జనవరి 11న బరోడాలో జరగనున్న తొలి వన్డేలో కివీస్‌తో టీమిండియా తలపడనుంది. భారత వన్డే స్క్వాడ్ : శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, హర్షిత్ రానా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ రెడ్డి, అర్షదీప్ సింగ్.

ధర్మఘంట




## లైన్ క్లియర్.. సాయిపల్లవి హిందీ డెబ్యూ సినిమా రిలీజ్‌పై క్లారిటీ!

మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ సాయిపల్లవి. ఈ కోలీవుడ్ అమ్మడు తెలుగు, తమిళం, మలయాళంలో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఇక హిందీలో కూడా సాయిపల్లవి తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అవుతుందని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ నటిస్తోన్న మేరే రహో సినిమాలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫైనల్ చేశారన్న వార్త బయటకు వచ్చింది. లేటెస్ట్ టాక్ ప్రకారం మేరే రహో చిత్రాన్ని జులై రెండో వారంలో విడుదల చేయబోతున్నారట. రిలీజ్ డేట్‌పై మేకర్స్ రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి సాయిపల్లవి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హిందీ డెబ్యూ మూవీ ఈ ఏడాది సెకండాఫ్‌లో థియేటర్లలో సందడి చేయనుందన్న వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. 2025లో తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయిపల్లవి. ఈ భామ ఖాతాలో మరో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రామాయణ ఉంది. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుంది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న మేరే రహో మూవీని సునీల్ పాండే డైరెక్ట్ చేస్తున్నాడు.



## మృణాళ్ ఠాకూర్‌ను హైదరాబాద్ పిలుస్తోందట.. ఇంతకీ ఎందుకో తెలుసా మరి?

టాలీవుడ్ హీరో అడివిశేష్ మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో డెకాయిట్ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే. షనీల్ డియో కథనందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ గురించి క్రేజీ అప్‌డేట్ షేర్ చేసింది మృణాళ్ ఠాకూర్. డెకాయిట్ ఫైనల్ షెడ్యూల్ పూర్తి చేసేందుకు తాను హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ పోర్షన్‌తో మృణాళ్ ఠాకూర్‌కు సంబంధించిన పార్ట్ పూర్తి కానుంది. హైదరాబాద్ పిలుస్తోంది.. అంటూ మృణాళ్ ఠాకూర్ షేర్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రకాశ్ రాజ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. డెకాయిట్ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌పై సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది.



## 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్ .. అంతర్జాతీయ వేదికపై అరుదైన రికార్డు దిశగా..

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ అడ్వెంచర్ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించబోయే ఈ చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 2027 సమ్మర్‌లో విడుదల చేస్తామని రాజమౌళి అధికారికంగా వెల్లడించగా, తాజాగా ఈ మూవీకి సంబంధించి రిలీజ్ డేట్ దాదాపుగా ఖరారైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 2027 ఏప్రిల్ 9న 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీరామ నవమి రోజున ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తే సినిమాకు మరింత ఆధ్యాత్మిక బలం చేకూరుతుందని టీమ్ భావిస్తున్నట్టు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంటున్నాయి. 'రామాయణం'లోని ఒక కీలక ఘట్టాన్ని ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు రాజమౌళి ఇప్పటికే వెల్లడించారు. ఇందులో మహేష్ బాబు శ్రీరాముడిగా కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ఆయన 'రుద్ర' అవతారంలో దర్శనమివ్వగా, ఆ లుక్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. కేవలం టైటిల్ గ్లింప్స్‌తోనే అంతర్జాతీయ స్థాయిలో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్లు రిలీజ్‌కు రెండేళ్ల ముందే ఇంటర్నేషనల్ లెవల్‌లో మొదలయ్యాయి. తాజాగా ఈ మూవీ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను పారిస్‌లోని ప్రతిష్టాత్మక 'లే గ్రాండ్ రెక్స్' థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. జనవరి 5న రాత్రి 9 గంటలకు బిగ్ స్క్రీన్‌పై ప్రత్యేక ఫార్మాట్‌లో గ్లింప్స్ ప్రదర్శన జరగనుంది. ఈ ఘనత సాధించిన తొలి ఇండియన్ సినిమాగా 'వారణాసి' చరిత్రలో నిలవనుంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, సృష్టి ఆవిర్భావం నుంచి వారణాసి నగర ప్రాధాన్యత, యజ్ఞ యాగాలు, గుహలు, మణికర్ణిక ఘాట్, చినమస్తా దేవి ఉగ్రరూపం వంటి అంశాలు కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రామాయణంలోని ఒక ప్రధాన ఘట్టాన్ని కథలో మిళితం చేస్తూ, మహేష్ బాబు రుద్రుడిగా, రాముడిగా ద్వంద్వ అవతారాల్లో కనిపించనున్నారన్న టాక్ వినిపిస్తోంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# ప్రమాదాల నుండి భద్రత కోసం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ మీ కుటుంబాలకు ఆరోగ్య రక్ష మా స్టారు హెల్త్ పూర్తి భద్రత





**ధర్మఘంట, జనవరి 5 సూర్యాపేట:**

ప్రమాదాల నుండి ప్రాణాలను రక్షించుకోవడానికి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ఎంతో ఉపయోగపడుతుందని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ జోనల్ హెడ్ మణికంఠ, ప్రముఖ గాయకుడు, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, నల్లగొండ డిసిఎంఎస్ చైర్మన్ బొళ్ళ వెంకట్ రెడ్డిలు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంక్ సమీపంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీసును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. అత్యవసర సమయంలో ప్రతి ఒక్కరికి ఉపయోగపడే పాలసీ ఇది ఒకటే అని అన్నారు. జీవితంలో ఎలాంటి సంఘటనలు జరిగిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ భద్రత తీసుకుంటుందని తెలిపారు. హాస్పటల్లో అయ్యే ఖర్చులు 20 నుండి 30 లక్షల వరకు ఈ ఇన్సూరెన్స్ భరిస్తుందని తెలిపారు. ఈ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 2006లో 22 కోట్లతో ప్రారంభించి 2025 నాటికి 16 వేల కోట్ల వరకు ఇన్సూరెన్స్ జరిగిందని తెలిపారు. 2026 సంవత్సరం ముగిసే లోపు 20వేల కోట్లకు పైగా వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జీఎస్టీ తీసివేయడం జరిగిందని అన్నారు. ఒక మనిషికి ఏదైనా జరిగి ఒకసారి హాస్పిటల్ కి వెళితే లక్షల్లో ఖర్చు అవుతుందని, ఆ భారాన్ని మొత్తం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ భరిస్తుందని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 850 ఆఫీసులో ఉన్నాయని 15 కోట్ల మంది మీ పాలసీని తీసుకున్నారని అన్నారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీసును సూర్యాపేటలో ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టాటా లైఫ్ మేనేజర్ వెంకట్ రెడ్డి, నలగొండ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్, రామారావు, సూర్యాపేట స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ బచ్చలకూరి విక్రమ్, పాస్టర్ దుర్గం ప్రభాకర్, దోరేపల్లి ప్రభాకర్, ఎస్ఎంలు, ఏడిఎం లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థల పునర్వైభవానికి ఉద్యోగులు సహకరించాలి






- ఉద్యోగుల సహకారంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది
- అందరూ కష్టపడినందుకే ట్రూ డౌన్ సాధ్యమయ్యింది
- 6,000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి గర్వ కారణం
- కూటమి ప్రభుత్వంలోనే ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ**

విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. స్థానిక వెన్యూ కన్వెన్షన్ హాల్లో ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయి డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. ఉద్యోగుల సహకారంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఏఈ ల కొరతకు సంబంధించి కూటమి ప్రభుత్వం నుంచి త్వరలోనే ఉద్యోగులు శుభవార్త వింటారని మంత్రి హామీ ఇచ్చారు. అదే విధంగా పీఆర్సీతో పాటు ఇంజనీర్ల కొరత అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యుత్ రంగానికి సంబంధించి లైన్ మెన్ నుంచి ఇంజనీర్ వరకు అందరూ కష్టపడితేనే ప్రజలకు ట్రూ డౌన్ రూపంలో ఊరట లభించిందన్నారు. దేశంలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలను ట్రూ డౌన్ చేసిన చరిత్ర సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మరోవైపు గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పేరుతో బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేసిందని మంత్రి విమర్శించారు. అవసరంలేని పవర్ పర్చేజ్ లతో గత ప్రభుత్వం 9 సార్లు కరంటు చార్జీలను పెంచి ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపిందని ఆయన ఆరోపించారు. విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని మంత్రి గొట్టిపాటి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. విద్యుత్ రంగం గొప్పదనాన్ని ప్రభుత్వం గర్వంగా చెప్పుకోవడానికి ప్రధాన కారణం ఉద్యోగుల కష్టమే అని ఆయన గుర్తు చేశారు. ఏపీ జన్ కోలో రికార్డు స్థాయిలో 6,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేసిన విద్యుత్ సంస్కరణలతోనే 7, 8 గంటల విద్యుత్ అంతరాయాల నుంచి 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా అందించే స్థాయికి వచ్చామన్నారు. అదే విధంగా శ్రీకాకుళంలో నూతన పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి సానుకూల నిర్ణయం వచ్చేలా స్థానికులతో చర్చిస్తామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. ఉద్యోగులకు అన్ని సమయాల్లో అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని ఆయన ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు బాగా పనిచేసి విద్యుత్ సెక్టార్ ఉద్యోగులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఆశయాల మేరకు పనిచేస్తే భవిష్యత్తులో ప్రైవేటీకరణ అనే సమస్య తలెత్తదు అని అన్నారు. అంతేకాకుండా ఉద్యోగులకు రావాల్సినవన్నీ కూడా సాధించుకోగల్గుతామన్నారు. ఉద్యోగులు బాగా పనిచేయడం వల్ల దేశంలోనే మంచి సంస్థలుగా జెన్ కో, ట్రాన్స్ కోలు గుర్తింపు పొందాయన్నారు. దేశంలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలను ట్రూ డౌన్ చేసిన చరిత్ర విద్యుత్ ఉద్యోగులకే దక్కుతుందన్నారు. వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తూ, నాణ్యమైన విద్యుత్ అందిస్తూ, విద్యుత్ సరఫరా లాస్ ను తగ్గించడం ద్వారా వినియోగదారులకు విద్యుత్ రేట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. ఎపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. శామ్యూల్ మాట్లాడుతూ ఎన్నో యేళ్ళుగా పరిష్కారం కాని విద్యుత్ ఉద్యోగుల సమస్యలను హామీ ఇచ్చిన ఆరు నెలల్లోనే చాలా వరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిష్కరించారన్నారు. తమ అసోసియేషన్ కు దాదాపు 50 సంవత్సరాలపైబడి చరిత్ర ఉందన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ లాంటి వ్యక్తులు విద్యుత్ శాఖ మంత్రిగా రావడం ఉద్యోగులకు సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వంలో పే రివిజన్ లో అందరికీ జీతాలు పెరిగితే మాకు తగ్గాయని, రాబోయే పే రివిజన్ లో అయినా మాకు న్యాయం చేయాలని కోరారు. ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ జనరల్ సెక్రటరీ కే. నాగ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల కోసం ఎపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ 1959 వ సంవత్సరం నుంచి పనిచేస్తుందన్నారు. ఈ అసోసియేషన్ లో ఎంతోమంది ఉద్దండులు ఉద్యోగుల హక్కుల కోసం పనిచేసారన్నారు. పే రివిజన్ అంటే ఇప్పుడు ఉద్యోగులు భయపడుతున్నారని, గత ప్రభుత్వంలో ఇచ్చిన పే రివిజన్ లో విద్యుత్ ఉద్యోగులకు అన్యాయం జరగటమే కారణమన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటూ సహకరించాలన్నారు. ఎపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ కే.వి రామారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమైన తక్కువ రేట్లకు నాణ్యమైన విద్యుత్ ను ప్రజలకు అందించేందుకు మా వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ మురళీ కృష్ణ యాదవ్, ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ చైర్మన్ సైలేంద్ర దూబే, తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ సందర్భంగా రెవెన్యూ క్లినిక్ సేవలు

- భూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి వీలు
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 58 రెవెన్యూ, 130 రెవెన్యూయేతర అర్జీలు
- -సమస్యల పరిష్కారంలోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ


**విజయవాడ**

ప్రజల సమస్యల పరిష్కారంలోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్‌కు ప్రాధాన్యమి స్తున్నామని.. కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ సందర్భంగా రెవెన్యూ క్లినిక్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సందర్భంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేయగా.. కలెక్టర్ లక్ష్మీశ ఈ విభాగాన్ని పరిశీలించి, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. రెవెన్యూ క్లినిక్‌కు విజయవాడకు సంబంధించి 21, తిరువూరుకు సంబంధించి 19, నందిగామకు 18 మొత్తం 58 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లు పగడ్బందీగా ఏర్పాటు చేయడం జరిగిందని.. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈ రెవెన్యూ క్లినిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆర్‌డీవోలు, మండల తహసీల్దార్లు రికార్డులతో సహా అందుబాటులో ఉంటారని.. ఏదైనా ఒక రెవెన్యూ అర్జీ వస్తే అక్కడికక్కడే క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. అడంగల్‌లో తప్పుల సవరణ, ఎఫ్ లైన్ అర్జీలు, రీసర్వే సమస్యలు, జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు, 22ఏ నిషేధిత భూముల రిజిస్టర్ నుంచి పట్టా భూములను తొలగించుట, ఆక్రమణల తొలగింపు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా, డీ పట్టా సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు, భూ

# గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేసిన నాయకులకు గుర్తింపు ఇవ్వాలి

**కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తండు శ్రీనివాస్ యాదవ్**


**ధర్మఘంట, జనవరి 5 సూర్యాపేట:**



సూర్యాపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ గెలవడం కోసం పార్టీ నాయకులు కలిసిమెలిసి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తండు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్దుల ఎంపిక కోసం సీనియర్ నాయకులతో కమిటీని వేయాలని తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేస్తానని అన్నారు. పార్టీలో కనీసం ఐదారు ఏండ్ల నుండి పనిచేస్తున్న వారికి టిక్కెట్లు ఇవ్వాలని, ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికి టిక్కెట్ ఇవ్వవద్దని చెప్పారు. సూర్యాపేట పట్టణంలో తాను 1980 నుండి ఎన్ఎస్ యుఐలో పనిచేశానని, సూర్యాపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా పనిచేశానని , మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాను పని చేశానని తాను చకిలం శ్రీనివాసరావు హయాంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కామారెడ్డి డిక్లరేషన్ అనుసరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ, బిజెపిలు యూటర్న్ తీసుకున్నాయని, గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్ లో వుందని అన్నారు. కానీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున బీసీలకు సీట్లు ఇవ్వడంతో బీసీలు 42 శాతం కంటే ఎక్కువగా సర్పంచులు గెలిచారని ఆయన అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో నలబై ఏళ్ల నుండి కీలకంగా పనిచేసిన వ్యక్తినని, తనలాంటి వాళ్ళు సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘంగా పనిచేసిన వాళ్లని కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు పిలవకపోవడం భాదాకరమని అన్నారు. జిల్లా స్థాయి ప్రభుత్వ పదవులను బీసీలకు ఇవ్వలేదని ఇకముందు అయినా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. డిసిసి అధ్యక్ష పదవి తుంగతుర్తికి ఇచ్చినందున సూర్యాపేటలోని బీసీలకు పార్టీ పరంగా పదవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# సూర్యాపేట ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**ఆర్టిస్ట్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తాం**



**ధర్మఘంట, జనవరి 5 సూర్యాపేట:**

సూర్యాపేట ఆర్టిస్ట్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు గోవర్ధన్ (గోవర్ధన ఆర్ట్స్) ప్రధాన కార్యదర్శి భవాని ఆర్ట్స్ (లక్ష్మణ్) అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మిర్చి యార్డులో ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా వారు గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లవేళలా ఆర్టిస్టులు అందరికీ అందుబాటులో ఉంటామని తెలిపారు. అసోసియేషన్ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. సభ్యులు అందరూ యూనియన్ నియమ నిబంధనలకు లోబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మనోఆర్ట్స్, ఉపాధ్యక్షులు విష్ణు, శేఖర్, భాను ఎలక్షన్ కమిటీ మెంబర్స్ భాస్కర్, మన్సూర్, ఖదీర్, వాసు, సత్యం, రాజు, గౌరవ అధ్యక్షులు పవన్, మాజీ అధ్యక్షులు శ్రీను, సీనియర్ ఆర్టిస్టులు రఘు, ప్రసన్న, లతీఫ్, ఆలీ, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్లకు నగదు రహిత వైద్యసేవలు అందించాలి




**ధర్మఘంట, జనవరి 05 సూర్యాపేట**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంను, ఆ సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన కమిటీ ఎన్నికను సోమవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం రోడ్డులో గల హోటల్ జయ భాస్కర ఇన్ లో నిర్వహించారు. ఆ సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన అధ్యక్షులుగా సుదగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, కోశాధికారిగా సుధాకర్, అసోసియేషన్ అధ్యక్షులుగా వెంకన్న, గౌరవ అధ్యక్షలుగా దేవిరెడ్డి రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి దండ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిఏలను వెంటనే చెల్లించాలన్నారు. పిఆర్సీని ప్రకటించాలని కోరారు. మార్చి 2024 తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులకు అన్ని రిటైర్డ్ బెనిఫిట్స్ చెల్లించాలని పేర్కొన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ ఎన్నికల అధికారులుగా ఖలీల్ అహ్మద్, రఘువీర ప్రసాద్, విద్యాసాగర్ రావు వ్యవహరించారు. ఈ సమావేశం లో సంఘ జిల్లా కోశాధికారి హమీద్ ఖాన్, ఉపాధ్యక్షురాలు ఆర్.నిర్మల, ప్రచార కార్యదర్శి గాలి శ్రీనివాస్, ఆత్మకూర్(ఎస్)మండల కార్యదర్శి ఎస్ కె. అబ్దుల్లా, తుంగతుర్తి మండల కార్యదర్శి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# లో-వోల్టేజ్ సమస్యకు చెక్





**రైతులకు పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్**

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

గన్నవరం

రాష్ట్రవ్యాప్తంగా లో–వోల్టేజీ సమస్యను రూపుమాపి, రైతులకు పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సోమవారం గన్నవరం విమానాశ్రయ పరిధిలో ఏపీ ట్రాన్స్‌కో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, సి పి డి సి ఎల్ సి ఎం డి పుల్లారెడ్డి, ఏపీ ట్రాన్స్కో జే ఎం డి సూర్య సాయి ప్రవీణ్ కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ నవీన్ లు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేపదే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని, కానీ తమ ప్రభుత్వం చరిత్రలో తొలిసారిగా 'ట్రూ అప్' చార్జీలకు బదులుగా 'ట్రూ డౌన్' ద్వారా యూనిట్‌కు 13 పైసలు తగ్గించిందని మంత్రి గుర్తుచేశారు. భవిష్యత్తులో చార్జీలు పెంచే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుకు రూ. 78 వేల వరకు రాయితీ ఇస్తున్నామని, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు అదనపు రాయితీతో సోలార్ విద్యుత్తును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ పంపిణీ నష్టాలను 18 శాతం నుండి 11 శాతానికి తగ్గించామని, దీనిని మరింత తగ్గించేందుకు సంస్కరణలు చేపడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కొత్తగా 75 వేల బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ.. విమానాశ్రయ అవసరాలతో పాటు గన్నవరం, విజయవాడ గ్రామీణ, కంకిపాడు మండలాల పరిధిలోని సుమారు 88 వేల సర్వీసులకు ఈ కొత్త సబ్ స్టేషన్ ద్వారా మేలు జరుగుతుందని తెలిపారు. దీనివలన కొన్ని లో వోల్టేజ్ సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయముతో పాటు గృహ అవసరాలకు దృష్టిలో ఉంచుకొని అధిక స్థాయి వోల్టేజ్ సామర్థ్యంతో నేడు 132/3 కెవి గన్నవరం విమానాశ్రయం విద్యుత్ ఉపకేంద్రాన్ని 31 కోట్ల రూపాయల వ్యయంతో నెలకొల్పామన్నారు. గన్నవరం, విజయవాడ గ్రామీణ, కంకిపాడు మండలాల పరిధిలో గృహ సర్వీసులు 62 వేలు, వాణిజ్య సర్వీసులు 18, వేలు, పారిశ్రామిక సర్వీసులు 2 వేలు, వ్యవసాయ సర్వీసులు 6వేలు మొత్తం సుమారు 88 వేల సర్వీసులు లబ్ధి పొందుతున్నాయన్నారు. దీంతో గంగూరు విద్యుత్ ఉపకేంద్రంపై లోడ్ కూడా తగ్గుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఉద్దేశంతో ఉన్నారన్నారు. ఇందులో భాగంగానే ట్రాన్స్లేషన్ నష్టాలు రాకుండాలని రాకుండా ఉండేందుకు వాణిజ్య రంగాల్లో అవసరాలను గుర్తించి కొత్తగా విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. మల్లవల్లి పారిశ్రామిక వాడ, రామవరప్పాడు, బాపులపాడు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్ స్టేషన్లను మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 10 వేల సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసేందుకు చొరవ చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. తన నియోజకవర్గంలోని పురుషోత్తమ పట్నం 70 సంవత్సరాల కిందట స్వాతంత్రం రాకమునుపే విద్యుత్తు లైన్ ఉండేదని శాసనసభలో ప్రస్తావించామన్నారు. దాన్ని ఒకసారి మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిశీలించాలని కోరుతున్నామన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్యతో పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పిన వెంటనే ఇంధనశాఖ మంత్రివర్యులు స్పందించి 132/33 కెవి విద్యుత్ కేంద్రం మంజూరుకు ఆమోదం తెలిపినందుకు మంత్రికి, ప్రధాన కార్యదర్శికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే రామవరప్పాడు లో రెండు 32 కెవి విద్యుత్ ఉప కేంద్రాలు, బాపులపాడు లో ఒక విద్యుత్ కేంద్రం అడిగిన వెంటనే మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తన నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, విద్యుత్ ఉప కేంద్రాలకు స్థలాల కేటాయింపులో భూ సమస్య ఉందన్నారు. కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి త్వరగా విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం మంత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే విద్యుత్ శాఖ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డైరెక్టర్లు ఏకెవి భాస్కర్, జేవి రావు, వెంకట రమణమూర్తి, విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్ కే రెడ్డి, విద్యుత్ శాఖ సీఈ సుదీవన్, ఎస్.ఈ. భాగ్యరాజ్, ఈ ఈ జయకర రాయ్, గన్నవరం తహసిల్దారు శివయ్య, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహా రావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, బీజేపీ నాయకులు కురుమద్దాలి ఫణికుమార్, జనసేన నాయకులు చిమటా రవివర్మ, టిడిపి నాయకులు గొడ్డళ్ల చిన్నరామారావు, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ రావు, మొవ్వ వెంకటేశ్వరరావు, గుజ్జర్లపూడి బాబురావు, వేములపల్లి శ్రీనివాసరావు, మేడేపల్లి రమ, అన్నే హరికృష్ణ, జాస్తి శ్రీధర్, లంకే రంగారావు, కొండేటి వెంకటేశ్వరరావు, తంగిరాల శ్రీనివాసరావు, మొవ్వ వేణుగోపాల్, చిన్నాల లక్ష్మీ నారాయణ, కర్రా ప్రసాద్ పాల్, పలువురు విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంటరి వృద్ధునికి నీడనిచ్చిన పీ-4 ప్రోగ్రామ్

**ఇల్లు నిర్మించి ఇచ్చిన సర్పంచ్ కుమారుడు**

**రూ.లక్షా 25వేలు వ్యయంతో పక్కా గృహం**

ఘంటసాల

పేదరిక నిర్మూలన ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ–4 ప్రోగ్రామ్ పేదల జీవితాల్లో మార్పు తెస్తోంది. దాతల ఔదార్యాన్ని పేదల చెంతకు చేర్చే నిజమైన వారధిలా నిలుస్తోంది. ఘంటసాల మండలం వేములపల్లి గ్రామం బీసీ కాలనీకి చెందిన బెజవాడ వీరరాఘవులుకు భార్యాపిల్లలు లేరు. ఆయన కొన్నేళ్ళ నుంచి పూరిపాకలో జీవిస్తున్నాడు. వీరరాఘవులు అవసరాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ సూర్యదేవర వెంకాయమ్మ



కుమారుడు సూర్యదేవర సాంబశివరావు వీరరాఘవులు నివసించే పూరి పాక స్థానంలో రూ.లక్షా 25వేలు వ్యయంతో రేకుల పైకప్పుతో నూతన పక్కా గృహం నిర్మించి ఇచ్చారు. సోమవారం ఈ నూతన ఇంటిని బెజవాడ వీరరాఘవులుకు అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు సమక్షంలో సూర్యదేవర సాంబశివరావు అప్పగించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ–4 ప్రోగ్రామ్.. గ్రామాల్లో పేదల అవసరాలను దాతలు నేరుగా గుర్తించి వాటిని తీర్చి, సమాజంలో పేదరిక నిర్మూలనకు మార్గదర్శకులుగా నిలిచే వేదికగా నిలుస్తోందన్నారు. ఒంటరి వృద్ధుడు వీరరాఘవులుకు ఇల్లు కట్టి ఇచ్చిన సర్పంచ్ కుమారుడు సూర్యదేవర సాంబశివరావును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాసిరెడ్డి వెంకట్రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రావులపల్లి సురేష్ కుమార్, ఏపీఓ రాజ్ కుమార్, నాగరాజు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భావితరాలకు బంగారు 'బాట'

**రూ. కోటి ఖర్చుతో పీ4 కింద వెల్వడంలో రహదారి**

**డా. లకిరెడ్డి హనిమిరెడ్డి సామాజిక సేవ**

**ఈ సేవాతత్పరత పేదల కుటుంబాలకు కొత్త వెలుగు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

మైలవరం

2029 నాటికి పేదరికాన్ని పూర్తిగా దూరంచేసే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమం ద్వారా ఇచ్చిన పిలుపుతో బంగారు కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎందరో మార్గదర్శులుగా ముందుకొస్తున్నారు. సామాజిక సేవకు సై అంటూ పేద కుటుంబాల జీవన స్థితిగతులను మార్చే మౌలిక వసతుల కల్పనకు సైతం మరికొందరు కృచేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా, మండల పరిధిలోని వెల్వడం గ్రామంలో రూ.కోటితో డా. లకిరెడ్డి హనిమిరెడ్డి పీ4 కార్యక్రమం కింద 750 మీటర్ల పొడవైన సిమెంటు రహదారిని నిర్మింపజేశారు. వరవకట్ట నుంచి తోలుకొడు వెళ్లే రోడ్డు వరకు వేసిన



ఈ రహదారిని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. డా. లకిరెడ్డి హనిమిరెడ్డికి పీ4 ధ్రువీకరణపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ డా. లకిరెడ్డి హనిమిరెడ్డి కుటుంబం ఇప్పటికే గ్రామంలో మూడు కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, నాలుగు కిలోమీటర్ల మేర డ్రెయిన్ల ఏర్పాటుకు నిధులు వెచ్చించిందన్నారు. అదే విధంగా పాఠశాలలు, కళ్యాణమండపం, బస్ షెల్టర్, రెవెన్యూ భవన్.. ఇలా వివిధ నిర్మాణాలకు దాదాపు రూ. 20 కోట్లతో చేయూతనిచ్చి సేవాతత్పరతను చాటుకున్నారన్నారు. తాజాగా రూ.కోటి ఖర్చుతో మరో రహదారిని నిర్మింపజేసి పెద్ద మనసు చాటుకున్నారన్నారు. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు మరింత మంది ముందుకురావాలని కోరారు. కేవలం ఆర్థిక వనరులే కాదు.. బంగారు కుటుంబాల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి, ఆరోగ్య అవసరాలు వంటివాటి విషయంలో మార్గదర్శులు వేసే ఓ చిన్న అడుగు పేద కుటుంబాలు ఎదిగేందుకు దోహదం చేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని వినియోగించుకోండి

**- ఆర్టీసీ డిపో మేనేజర్ శివాజీ**




గన్నవరం

ఏపీఎస్ఆర్టీసీలో కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని వినియోగించుకుని ప్రయాణికులు వారి పార్సెల్లు, కొరియర్ కవర్లు అతి తక్కువ ఖర్చుతో అతి త్వరగా పంపవచ్చని గన్నవరం డిపో మేనేజర్ శివాజీ తెలియజేశారు. గన్నవరం డిపోలో నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక బస్ స్టేషన్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి కార్గో డోర్ డెలివరీ గురించి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచి కార్గో డోర్ డెలివరీ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్గో డోర్ డెలివరీ ద్వారా రాష్ట్రం లోని 84 ముఖ్య పట్టణాల్లో ఈ సదుపాయం ఉందని పార్సెల్, కవర్లను కస్టమర్ల ఇంటికే తీసుకెళ్లి డెలివరీ చేస్తారని ఈ సదుపాయాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో సూపర్వైజర్లు మధు, వెంకటేశ్వర రావు, యూనియన్ నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆకలి తీర్చే సేవా వారం ప్రారంభం



ఆగిరిపల్లి


అన్ని దానముల కన్నా అన్నదానం గొప్పదని, ఆకలి లేని ప్రపంచం కోసం లయన్స్ ఇంటర్నేషనల్ పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ. లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వపు డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లిలో గల హీల్ పారడైజ్ చిల్డ్రన్స్ హోం నందు లయన్స్ సేవాయజ్ఞంలో భాగంగా రిలీవ్ హంగర్– ఆకలి లేని ప్రపంచం కొరకు ప్రయాణం వారోత్సవాన్ని సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకలి తీర్చే సేవా వారం రూపకర్త, నిర్వాహకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ డిస్ట్రిక్ట్ 316డి పూర్వపు గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ జనవరి 3వ తేది నుండి 11వ తేదీ వరకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఎన్వివిఎస్వి ప్రసాద్, చిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దినేని చక్రధర్, బి.సునీల్ కుమార్, బిఇ సిహెచ్ బి ప్రసాద్, బి లక్ష్మి సరోజిని, డా. పిఎస్ఎన్ మూర్తి, జీవి మనోహర్, ఫీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సీఈవో కూరపాటి అజయ్ కుమార్, హీల్ ప్రిన్సిపల్ యార్లగడ్డ లతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఆంధ్ర సాకారానికి కలిసికట్టుగా కృషిచేయాలి

**- మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ



ఆరోగ్య ఆంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందని.. ఈ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సోమవారం మైలవరంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీ తదితరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిబద్ధతతో సేవలందించాలని.. రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

## ఆవకాయ ఉత్సవాలకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

**క్షేత్రస్థాయి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు**

విజయవాడ



ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఆవకాయ.. సినిమా, సంస్కృతి, సాహిత్య అమరావతి ఉత్సవాలకు సమన్వయ శాఖల అధికారుల భాగస్వామ్యంతో పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్పీ రాజశేఖరబాబు.. టీమ్‌వర్క్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్‌తో కలిసి సోమవారం పున్నమిఘాట్‌ను సందర్శించారు. కార్యక్రమాల షెడ్యూల్, వేదికల వద్ద సీటింగ్ అరేంజ్‌మెంట్, సందర్శకుల భద్రత, ట్రాఫిక్ ప్రణాళిక, వేదికల వద్ద ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లతో పాటు చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కలిసికట్టుగా ఆవకాయ్ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. దసరా ఉత్సవాలు, భవానీ దీక్షా విరమణల సందర్భంగా ఆధునిక సాంకేతికత సహకారంతో భక్తుల భద్రతకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంతో ఇదే స్ఫూర్తితో ఆవకాయ్ ఉత్సవాలకు తరలివచ్చే సందర్శకుల భద్రతకు పెద్దపీట వేస్తూ భద్రతా ప్రణాళికల అమలుకు సీపీ రాజశేఖరబాబు పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

ధర్మఘంట

# రంగారెడ్డి జిల్లా విభజనకు ముందు దేవరకొండకు జిల్లా హోదా ఇవ్వాలి

## గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురాం నాయక్

**దేవరకొండ**

రంగారెడ్డి జిల్లాను విభజించి రెండుగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనల నేపథ్యంలో, ముందుగా మారుమూల గిరిజన ప్రాంతమైన దేవరకొండకు జిల్లా హోదా కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురాం నాయక్ డిమాండ్ చేశారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన జిల్లాలను విభజించడంకన్నా, తీవ్ర వెనుకబాటుతనంతో ఉన్న దేవరకొండను జిల్లాగా ప్రకటించడం సామాజిక న్యాయానికి నిదర్శనమని ఆయన అన్నారు. శనివారం దేవరకొండలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చారిత్రకంగా, భౌగోళికంగా, సాంస్కృతికంగా ప్రాధాన్యం ఉన్న దేవరకొండ ప్రాంతానికి ఇప్పటికీ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో చేరలేదని విమర్శించారు. పద్మరాజుల పాలనలో దేవరకొండ ఖిల్లా పరిపాలనా, సైనిక కేంద్రంగా ఉన్నదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిహ్నంలో ఉన్న పూర్ణకుంభం దేవరకొండ ఖిల్లా నుంచే తీసుకెళ్లబడిందని గుర్తు చేశారు. దేవరకొండ పరిసర ప్రాంతాల్లో ఉన్నత విద్యా సంస్థలు లేకపోవడం, ప్రభుత్వ వైద్య సదుపాయాల బలహీనత, ఆడపిల్లల విద్య, భద్రత సమస్యలు, గిరిజన గ్రామాల్లో త్రాగునీరు, రవాణా, ఉపాధి, నివాస వసతుల కొరత తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయి కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు చిన్న పనులకైనా దూర పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం దేవరకొండ నుంచి జిల్లా కేంద్రం నల్లగొండకు వెళ్లాలంటే సుమారు 160 కిలోమీటర్లు, డిండి మండల ప్రజలు సుమారు 130 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. ఈ దూరాల వల్ల ప్రజల సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇప్పటికే హైదరాబాద్ సమీపంలో ఉండి అన్ని విధాలుగా అభివృద్ధి చెందినదని, అలాంటి జిల్లాను విభజించే ముందు వెనుకబడిన దేవరకొండను జిల్లాగా ప్రకటించడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయానికి పెద్ద అడుగు వేయాలని కోరారు. దేవరకొండ జిల్లా సాధన కోసం ఉద్యమం కొనసాగుతుందని, త్వరలో ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలు, జాతీయ రాజకీయ పార్టీలకు అధికారిక ప్రతినిధి పత్రం సమర్పిస్తామని బాబురాం నాయక్ తెలిపారు.



# విద్యే వెలుగు గ్రామాభివృద్ధికి దారి

## కుర్మేడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతన పాలకవర్గానికి ఆత్మీయ సన్మానం




**చింతపల్లి**

విద్య దేవత ఆశీస్సులతో గ్రామ ప్రగతికి అడుగులు పడుతున్న వేళ, చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు గ్రామ నూతన పాలకవర్గానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం భక్తి భావం నిండిన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ శుభసందర్భంలో కుర్మేడు గ్రామ నూతన సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ లాలయ్య, ఉపసర్పంచ్ అనంతుల పవన్, మాజీ ఎంపీటీసీ కుంభం శ్వేత శ్రీశైలం గౌడ్, గ్రామ వార్డు సభ్యులు పాల్గొని కార్యక్రమానికి శోభ చేకూర్చారు. విద్యాలయ ప్రాంగణంలో జ్ఞానజ్యోతి వెలిగినట్లుగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. అనంత రెడ్డి నూతన పాలకవర్గ సభ్యులకు పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే మానవుడికి మహాశక్తి. విద్య వికసిస్తే గ్రామం వికసిస్తుంది అని పేర్కొంటూ, గ్రామాభివృద్ధితో పాటు విద్యారంగ ప్రగతికి పాలకవర్గం నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుర్మేడు గ్రామానికి నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు కురుమేటి శిరీష గౌని విజయ శ్రీకాంత్ బొడ్డు శివ జడ శివాని శివ సీత పవన్ కురుమేటి తరుణ్ నాదిరి పురుషోత్తం గోరటి కవిత శేఖర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని భక్తి భావంతో విజయవంతం చేశారు.

# పట్నం ఓటర్ జాబితా గందరగోళం

**అధికారులను ప్రశ్నించిన ఇబ్రహీంపట్నం బిఆర్ఏస్.. స్పందించి వార్డులల్లో ఓటర్ల జాబిత రి సర్వే**

**ఓటర్ల లిస్టులో తప్పులుంటే మార్పు వార్డు ప్రజలు మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకొండి:జెర్కొని రాజు**






**ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో విడుదలైన ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా తీవ్ర అయోమయానికి దారి తీసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నెల 1న మున్సిపాలిటీ అధికారులు విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ల లిస్టులో అనేక తప్పులు ఉన్నాయని పేర్కొంటూ, ఓటర్ అభ్యంతరాల స్వీకరణ కోసం మున్సిపాల్ అధికారులు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువ నాయకుడు జెర్కొని రాజు మాట్లాడుతూ, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లను మార్పు చేసినట్టు అనుమానాలు వ్యక్తం చేశారు. నివాసం ఒకచోట ఉండగా, ఓట్లు మరో వార్డులో నమోదు చేయడం, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు వార్డుల్లో చేర్చడం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు.డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రజలను పూర్తిగా గందరగోళానికి గురి చేస్తోందని, ఎన్నికల ముందు ఈ ఇలాంటి తప్పులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని జెర్కొని రాజు అన్నారు. వెంటనే జాబితాను సరిచేసి, అన్ని పార్టీల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. నివాసం ఒకచోట ఉండగా, ఓట్లు మరో వార్డులో నమోదయ్యాయని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు వార్డుల్లోకి వెళ్లిపోయారని ఆరోపించారు.నివాసం ఒకచోట ఉండగా, ఓట్లు మరో వార్డులో నమోదయ్యాయని, ఒకే కుటుంబానికి చెందిన




ఓటర్లు వేర్వేరు వార్డుల్లోకి వెళ్లిపోయారని ఆరోపిస్తున్నారు.

మొత్తం 24 వార్డులున్న ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 25,993 మంది ఓటర్లు ఉండగా,

పురుష ఓటర్లు: 12,741

మహిళా ఓటర్లు: 13,252

అయితే గణాంకాలకన్నా జాబితాలోని తప్పులే ఇప్పుడు ప్రధాన చర్చకు కారణమయ్యాయి.

**అధికార పార్టీకి అనుకూలంగా మార్పు ఏలా అనీ**

డ్రాఫ్ట్ లిస్టులో అధికార పార్టీకి అనుకూలంగా పేర్లను చేర్చడం, తొలగించడం జరిగింద అనీ ప్రశ్నించారు. ఈ అంశంపై రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించగా, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మున్సిపాలిటీ కమిషనర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఓటర్ లిస్టులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఓటర్ల నివాసం మారకుండా ఉన్నా పేర్లు ఇతర వార్డుల్లోకి వెళ్లిపోవడంతో ఓటు హక్కు కోల్పోతామన్న భయం ఓటర్లలో వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ఇప్పుడే సవరణలు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక సెల్ ఏర్పాటు : పెరిగిన అభ్యంతరాల నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ జాబితాపై వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, అవసరమైన సవరణలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

**8 వరకు అభ్యంతరాల స్వీకరణ చేస్తాం:కమిషనర్**

ఓటర్ల జాబితా సవరణలపై అభ్యంతరాలు స్వీకరిం చేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ను ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో ఓటర్ల సవరణకు దరఖాస్తులు వచ్చాయని ఈ నెల 8వ తేది వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నీలం స్వేత బాలు, ఖాజబాయ్,మల్లేష్ యాదవ్,కొంద్రు ప్రవీణ్,వినోద్ కుమార్ సుల్తాన్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్ కుమార్, ,మంద సుధాకర్, ఆకుల సురేష్, కసరమోని మల్లేష్, శంకర్ నాయక్, కొంద్రు ప్రవీణ్,మడుపు గోపాల్,కొత్త గణేష్ గౌడ్,వార్డు అధ్యక్షులు సోప్పరి కరుణాకర్, కర్నె అరవింద్, కనుగుల మహేష్,దయచారి, శ్రవణ్, త్రిలోక్,మనిష్, మహేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మెంటన్ ఎంపికైన గట్టుప్పల్ విద్యార్థులు

**గట్టుప్పల్**



ఈనెల 9 నుండి 11 వరకు, నిజాంబాద్ ఆర్మూర్ లో జరిగే రాష్ట్ర స్థాయి 70 వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలుర ,బాలికల జట్లకు ఎంపికైన. నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండల విద్యార్థులు ఎంపికైన బాలికల విభాగం, ఎన్ అక్షర ,ఎన్. వర్షిత ,కే అక్షర, పి శ్రీవాణి బాలుర విభాగం వి.జగన్, పీ వంశి, జే.అజయ్ ఎంపికైనట్లు. జిల్లా సెక్రెటరీ, ఎ బయన్న కోచ్ జంగయ్య. ఏ గణేష్, చంద్రశేఖర్. పి. చందన తెలిపారు.

# అనాధ పిల్లలకు గ్లోబల్ హెచ్ ఆర్ సంస్థ చేయూత




**రంగారెడ్డి**

గ్లోబల్ హెచ్ ఆర్ ఫెడరేషన్ సంస్థ వినూత్న సేవా కార్యక్రమాన్నీ చేపట్టింది. అబ్దుల్లాపూర్ మెట్ లోని బాచరంలోని ఫ్రెండ్స్ ఫౌండేషన్ లోని అనాధ పిల్లలకు బుక్స్ స్టేషనరీ గ్రాసరి వస్తువులు టాబ్లెట్స్ బట్టలు ఆట వస్తువులు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.కార్న్ జి ఇన్ఫోటెక్,డిలిజెంట్ ,ఐ ఆర్ ఎస్ ఎం ,హై రైస్ పివిఆర్ మిడోస్ వంటి పలు కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యంతో సీఎస్ ఆర్ నిధులతో అనాధ పిల్లలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని గ్లోబల్ హెచ్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ రోహిత్ పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్పొరేట్ సంస్థను ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామి చేయాలనేదే గ్లోబల్ హెచ్ ఆర్ ఫెడరేషన్ సంస్థ ప్రధాన ఉద్దేశమని రోహిత్ వ్యక్తం చేశారు. ఈనెల 31న హైదరాబాద్ లో నిర్వహించబోయే గ్లోబల్ హెచ్ ఆర్ కన్వెక్షన్ సీసన్ 2 కు కార్పొరేట్ సంస్థల హెచ్ ఆర్ లు అందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మని,శైలజ,హారిక,యోగిత పలువురు పాల్గొన్నారు.

# ప్రజావాణికి (45) ఫిర్యాదులు

**రంగారెడ్డి :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (45) ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి స్వీకరించారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి సోమవారం రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమానికి హాజరై జిల్లా స్థాయిలో ప్రజావాణి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ప్రజావాణి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే



పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు.

**రెవెన్యూ శాఖ 19, ఇతర శాఖలు 26, మొత్తం 45 దరఖస్తులు అందాయి.**

అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూడాలని, యూరియా యాప్ లాంచ్ అయిన తరువాత యాప్ నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే ప్రతి హాబీటేషన్ లో పంచాయతీ సెక్రెటరీ, జీపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్, ఏఈఓలకు యూరియా యాప్ నిర్వహణలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాబోయే పరీక్షలలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తర్ణీత సాధించేల వారికి ప్రణాళికను సిద్దం చేసి దాని ప్రకారం ప్రత్యేకమైన తరగతులను నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మరింత శిక్షణ ఇవ్వాలని, అన్నారు. అండర్-15, అండర్-19 మహిళా చెస్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ లలో గెలుపొందిన అత్తాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 10వ తరగతి చదువుతున్న జి.శివాంషికను కలెక్టర్ అభినందించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కురుమేడు గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ



**చింతపల్లి**

చింతపల్లి మండల పరిధిలోని కురుమేడు గ్రామంలో సోమవారం సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ లాలయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, గ్రామాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు పేద కుటుంబాలకు భరోసానిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనంతుల పవన్ గ్రామ వార్డు సభ్యులు పవన్, కుర్మేటి వెంకటేష్, కుర్మేటి తరుణ్ సుధాకర్, జక్కుల జయలక్ష్మి, కుర్మేటి చైతన్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# సాగర సంరక్షణకు సముద్ర ప్రతాప్

పణజీ

భారత సముద్రతీర ప్రాంతాల్లో సాగరజలాలలను కాలుష్యం బారి నుంచి కాపాడే అత్యాధునిక తీరగస్తీదళ నౌక ఐసీజీ సముద్ర ప్రతాప్‌ను భారత్ విజయవంతంగా రంగంలోకి దింపింది. సోమవారం గోవాలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా నౌక ను జలప్రవేశంచేయించారు. భారత ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)తోపాటు ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్(ఈఈజెడ్)లకు రక్షణగా నిలబడుతూనే సముద్రప్రాంతంలో కాలుష్య నియంత్రణ, సముద్రజలాల్లో చట్టాల అమలు, విపత్కర పరిస్థితుల్లో బాధితుల కోసం అన్వేషణ, సహాయ కార్యక్రమాల్లో ఐసీజీ సముద్ర ప్రతాప్ పాలుపంచుకోనుంది. భారత్‌లో నిర్మాణం పూర్తిచేసుకున్న అతిపెద్ద కాలుష్య నియంత్ర నివారణ నౌకగా ఇది రికార్డ్ సృష్టించింది. దేశ నౌకనిర్మాణ రంగ కౌశలతకు కొత్త నౌక దిక్సూచీగా నిలుస్తుందని రాజ్‌నాథ్ అన్నారు. భవిష్యత్‌లో భారత నౌకారంగం, దీర్ఘకాలిక, స్వచ్ఛమైన, సురక్షితమైన, భద్రమైన వృద్ధి పథంలో దూసుకుపోయేందుకు ఈ నౌక చుక్కానిలా నిలిచిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ తయారుచేసిన ఈ నౌకను గత నెలలోనే తీరగస్తీ దళానికి అందజేశారు. దక్షిణ గోవాలోని వాస్కోలో ఉన్న గోవాష్ట్‌యార్డ్ లిమిటెడ్ పరిధిలోని సముద్రజలాల్లో సోమవారం ఈ నౌకను అధికారికంగా రాజ్‌నాథ్ జలప్రవేశం చేయించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ పరమేశ్ శివమణి సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత అద్భుతమైన నావికా దార్శనికతతో ఈ కార్యక్రమం అనుసంధానమైందని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

**ఎన్నో ప్రత్యేకతల సమాహారం...**

ఈ నౌకలోని మొత్తం 60 శాతం విడిభాగాలు, ఉపకరణాలను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేశారు.

- 114.5 మీటర్ల పొడవైన ఈ నౌక బరువు ఏకంగా 4,200 టన్నులు.
- ఇది గంటకు 22 నాటిక్ మైళ్లకంటే అధిక వేగంతో దూసుకెళ్లగలదు
- పూర్తి ఇంధన సామర్థ్యంతో ఏకంగా 6,000 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించగలదు
- వాణిజ్యనౌకలు, సరకు రవాణా నౌకల నుంచి ఒలికిపోయే, ప్రమాదాల కారణంగా సముద్రజలాల ఉపరితలంపై చేరిన ముడిచమురు, తెట్టును ఈ నౌకతొలగించగలదు
- ఒక పూర్తిస్థాయి కాలుష్యనియంత్రణ పరిశోధనశాలను ఈ నౌకలో ఏర్పాటుచేశారు
- వ్యర్థాలను ఒక దగ్గరకు లాక్కొచ్చే సైడ్ స్వీపింగ్ చేతులు, ఫ్లోటింగ్ బూమ్‌లు, అత్యధిక సామర్థ్యముండే స్కిమ్మర్లు, పోర్టబుల్ బార్జ్‌లు ఇలా అన్ని రకాల పరికరాలతో ఈ నౌకలో ఉన్నాయి
- చమురునౌకలకు అగ్నిప్రమాదం సంభవిస్తే అగ్నికీలలను ఆర్పే ఎఫ్ఐఎఫ్ఐ క్లాస్1 తరగతి స్థాయి శక్తివంతమైన అగ్నిమాపక వ్యవస్థ ఇందులో ఉంది
- ఒక హెలీప్యాడ్‌తోపాటు అనుమానిత నౌకలను అడ్డుకునేందుకు చిన్నపాటి ఇంటర్‌సెప్టార్ పడవలను ఇందులో ఉంచారు.
- కీలక సమయాల్లో స్వతంత్రంగా ఈ నౌక పనిచేస్తుంది. ప్రతిసారీ బయటి నుంచి సరకుల సరఫరా కోసం ఆధారపడకుండా ఎక్కువ సరకులను నిల్వచేసుకుని ఏకధాటిగా ఒకేసారి వేల నాటికల్ మైళ్ల పరిధిలో గస్తీ, అన్వేషణ, సహాయ కార్యక్రమాల్లో ఈ నౌక నిమగ్నంకాగలదు
- డైనమిక్ పొజిషనింగ్‌తోపాటు రెస్క్యూ ఆపరేషన్‌ల వేళ ఇతర నౌకతో అనుసంధానమయ్యేలా సమీకృత అనుసంధాన వ్యవస్థ, సమీకృత వేదికా వ్యవస్థ, స్వయంచాలిత ఇంధన నిర్వహణ వ్యవస్థ, ఆటోమేషన్ ఇలా పలు రకాల అత్యాధునిక వ్యవస్థలూ ఇందులో ఉన్నాయి.
- శత్రువుల పీచమణిచేందుకు 30 ఎంఎం సీఆర్ఎన్91 రకం గన్, రెండు12.7 ఎంఎం రిమోట్ కంట్రోల్ గన్‌లనూ ఈ నౌకకు బిగించారు.
- కొచ్చి స్థావరంగా పనిచేసే ఈ నౌకలో 14 మంది అధికారులు, 115 మంది సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారు. వీళ్లలో ఇద్దరు మహిళాధికారులు సైతం విధులు నిర్వర్తించనున్నారు
- 7,500 కి.మీ.ల తీర గస్తీ బాధ్యతలతోపాటు 20 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ రక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చగలదు నౌకల ప్రమాదాల, సముద్రాల్లోకి చట్టవ్యతిరేకంగా వ్యర్థాల పారబోత, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అడ్డుకోవడంలో నౌక కీలకపాత్ర పోషించనుంది సముద్రాల్లో కాలుష్యాన్ని అరికట్టేందుకు కృషిచేయడం ద్వారా ప్రత్యక్షంగా మత్స్య సంపద వృద్ధికి, తద్వారా మత్స్యకారుల ఉపాధి, జీవనం,ఆదాయానికి ఈ నౌక భరోసా ఇవ్వనుంది ఇదే తరహా విధుల్లో ఉన్న సముద్ర ప్రహరీ, సముద్ర వన్‌విజయ్ నౌకలకు దన్నుగా ఇది నిలబడనుంది మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోగలదు. రూ.284 కోట్ల వ్యయంతో ఈ నౌకను నిర్మించారు

# ఖలీద్, ఇమామ్‌లకు నో బెయిల్

న్యూఢిల్లీ

ఆరేళ్ల క్రితం దేశ రాజధానిలో 53 మంది మరణాలకు, 700 మందికిపైగా గాయాలపాలు కావడానికి కారణమైన భారీ అల్లర్ల కేసులో నిందితులు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) మాజీ విద్యార్థులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. వీళ్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ బెయిల్ ఇచ్చేది లేదని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ వీఎన్ అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. అల్లర్లకు భారీ స్థాయిలో కుట్ర పన్నడం, అమలు చేయడం, అల్లరిమూకలకు మార్గదర్శకం వహించడం, అల్లర్లలో భాగస్వాము లుగా మారడం దాకా ప్రతిదశలో వీళ్ల పాత్ర ఉన్నట్లు తెలిపే బలమైన సాక్ష్యాధారాలు ఉన్న కారణంగా ఖలీద్, ఇమామ్‌ల బెయిల్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. " ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక)చట్టం(ఉపా)లోని సెక్షన్ 43డీ(5) ప్రకారం నిందితులపై ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలుంటే బెయిల్‌ను కోర్టు తిరస్కరించవచ్చు. దీని ప్రకారం వీళ్ల బెయిల్ పిటిషన్ తిరస్కరణకు అర్హమైందే. కేసు కీలక దర్యాప్తు, విచారణదశలో ఉన్న ఈ తరుణంలో వీళ్లిద్దరికీ బెయిల్ ఇవ్వడం సముచితం అనిపించుకోదు. కేసు విచారణ ఆలస్యమైనంత మాత్రాన నిందితులకు కొత్తగా ఒనగూరేది ఏమీ ఉండదు. నేరంలో లోతైన ప్రమేయం ఆధారంగా ఏడుగురు నిందితులను ఒకే గాటన కట్టట్లేము. అందుకే ఇతర ఐదుగురు నిందితులైన గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్, మొహమ్మద్ సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు బెయిల్ ఇస్తున్నాం" అని సోమవారం సుప్రీంకోర్టు ప్రకటించింది.

**11 షరతులు విధించిన కోర్టు**

ఈ సందర్భంగా ఈ ఐదుగురికి కోర్టు 11 షరతులు విధించింది. " తలా రూ.2 లక్షల పూచీకత్తుతో వ్యక్తిగత బాండ్ సమర్పించండి. దేశం దాటి ఎక్కడికీ పోవద్దు. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోనే అధికారులకు అందుబాటులో ఉండాలి. పాస్‌పోర్టులను అధికారులకు ఇచ్చేయాలి. ఢిల్లీ జైసింగ్ మార్గ్ పోలీస్‌స్టేషన్‌కు ప్రతి సోమ, గురువారాలు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలి. మీరు ఉండబోయే ఇంటి అడ్రస్, వాడబోయే ఫోన్ నంబర్, ఈమెయిల్‌లను దర్యాప్తు అధికారులకు ఇవ్వాలి. కేసు పూర్తయ్యేదాకా కేసు వివరాలు ఎక్కడా ఎవరితో పంచుకోవద్దు. ప్రచారసభల్లో ప్రసంగాలు చేయొద్దు. భౌతికంగా, ఎలక్ట్రానిక్ వస్తువులు, మాధ్యమాల్లో ఎలాంటి అంశాలను ప్రచారంలోకి తేవొద్దు" అని కోర్టు వాళ్లకు సూచించింది.

**వీళ్లది కీలక పాత్ర..**

" ఉమర్ ఖలీద్, ఇమామ్‌లు భారీ కుట్రలో కీలక భాగస్వాములుగా ఉన్నారు. వ్యూహరచన, అల్లరిమూకలను రెచ్చగొట్టడం, లక్షిత ప్రాంతాల్లో గుమిగూడేలా చేయడం, ప్రణాళిక అమలులో వీళ్ల పాత్ర ఉందని ప్రాథమిక సాక్ష్యాధారాలు స్పష్టంచేస్తున్నాయి. ట్రంప్ పర్యటన సందర్భంగా జనం రోడ్లమీదకొచ్చి రాస్తారోకోలు, ధర్నాలు చేసేలా ఫిబ్రవరి 24, 25 తేదీల్లో ఖలీద్ విద్వేషపూరిత ప్రసంగాలిచ్చాడు. భారత్‌లో మైనార్టీలు హింసకు బలవుతున్నారనే వాదనలు నిజమని అంతర్జాతీయ సమాజం విశ్వసించేలా ప్రసంగాలిచ్చారు. జేఎన్‌యూ వర్సిటీలో ముస్లిం స్టూడెంట్స్ ఆఫ్ జేఎన్‌యూ వాట్సాప్ గ్రూప్ సృష్టించి అందర్నీ సమీకరించాడు. ఇతని పాత్ర ఒక్క ఢిల్లీకే పరిమితం కాలేదు. జనాన్ని పోగేసేందుకు అలీగఢ్, ఇతర ప్రాంతాల్లోనూ పర్యటించాడు" అని ధర్మాసనం తన తీర్పులో పలు అంశాలను ప్రస్తావించింది.





**గుల్ఫిషా ఫాతిమా పాత్రపై..**

"ఇక మరో నిందితురాలు గుల్ఫిషా ఫాతిమా.. స్థానిక మహిళలను పోగేసి నిరసన ప్రదర్శనల ప్రాంతాలకు తరలించారని, ఉద్యమ సంబంధ వస్తువుల సేకరణకు సాయపడ్డారని చేసిన వాదనల్లో పస లేదు. అందుకే ఆమెకు బెయిల్ ఇస్తున్నాం" అని కోర్టు స్పష్టంచేసింది. పౌరసత్వ సవరణచట్టం2020, జాతీయ పౌరపట్టీ (ఎన్‌ఆర్‌సీ)లను తీవ్రంగా వ్యతిరేకిస్తూ చట్టవ్య తిరేక విద్వేషక ప్రసంగాలు చేశారన్న ఆరోపణలపై ఇమామ్‌ను పోలీసులు 2020 జనవరి 28వ తేదీన, సెప్టెంబర్ 13వ తేదీన ఖలీద్‌ను అరెస్ట్‌చేశారు.

ఈ కేసులో బెయిల్ కుదరదని ఢిల్లీ హైకోర్టు గత ఏడాది సెప్టెంబర్ రెండో తేదీన ఇచ్చిన తీర్పును ఖలీద్, ఉమర్‌తోపాటు మరో ఐదుగురు నిందితులు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా గత ఏడాది డిసెంబర్‌లో వాదనలు పూర్తయ్యాయి. నిందితుల తరపున కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, సల్మాన్ ఖుర్షీద్, సిద్ధార్థ్ లూథ్రా హాజరై వాదనలు వినిపించారు. ఢిల్లీ పోలీసుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు వాదనలు వినిపించగా తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన రిజర్వ్‌చేసి సోమవారం తీర్పును వెలువర్చింది. సాక్ష్యాధారాల పరిశీలన, సాక్షుల విచారణ తర్వాత లేదా ఏడాది తర్వాత ఉమర్, ఇమామ్‌లు తాజాగా బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మాసనం సూచించింది. ఉత్తర ఢిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్ల వెనుక ముందస్తు ప్రణాళిక దాగి ఉందని, ఇలాంటి వ్యూహరచన, అమలు అనేవి దేశ సార్వభౌమత్వంపై దాడి అని ఢిల్లీ పోలీసులు విచారణ సందర్భంగా వాదించారు. అందుకే అత్యంత కఠినమైన ఉపా, భారత శిక్షాస్మృతి సెక్షన్ల కింద కేసు నమోదుచేశామని వాదించారు.

**అదృష్టం లేదంతే**

బెయిల్ తిరస్కృతిపై ఖలీద్ తండ్రి ఆవేదన

న్యూఢిల్లీ: ఉమర్ ఖలీద్‌కు బెయిల్ రాకపోవడంపై అతని తండ్రి ఎస్‌క్యూఆర్ లియాస్ ఆవేదన వ్యక్తంచేశారు. " తీర్పు కాపీ అందరికీ అందుబాటులోనే ఉంది. దీనిపై నేను కొత్తగా చెప్పేదేం లేదు. ఖలీద్ విషయంలో మాకు అదృష్టం లేదంతే. ఇది నిజంగా దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు.

**ఇకపై ఇదే నా కొత్త జీవితం..**

తీర్పుపై ఖలీద్ సహచరిణి బానోజ్యోత్స్న లాహిరి 'ఎక్స్' వేదికగా స్పందించారు. అతనికి బెయిల్ రాకపోయినా తన తోటి వాళ్లు బెయిల్‌పై విడుదల అవుతున్నందుకు ఖలీద్ సంతోషం వ్యక్తం చేశాడని బానోజ్యోత్స్న వెల్లడించారు. " బెయిల్ కనీసం వాళ్లకయినా వచ్చిందికదా. సంతోషం. నాకెంతో తృప్తిగా ఉంది" అని ఖలీద్ అన్నారు. దీనికి స్పందనగా " నేను రేపు వచ్చి జైలులో నీతో ములాఖత్ అవుతాను" అని జ్యోత్స్న సమాధానం ఇచ్చారు. దీనికి స్పందనగా ఖలీద్ " మంచి పని. వచ్చేసెయ్. ఇకపై ఇదే నా కొత్త జీవితం" అని వ్యాఖ్యానించాడు.

**ఆయనకు 15 సార్లు ఎలా?**

ఉమర్ ఖలీద్, ఇమామ్‌ల బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు వెలువ ర్చిన తీర్పుపై విపక్ష నేతలు అసహనం వ్యక్తంచేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిటాస్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పె ట్టారు. " వీలైనంత వరకు నిందితులకు బెయిల్ ఇచ్చేందుకే చూడాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే జైలుకు పంపాలి అనే సూత్రం అందరికీ ఒకేలా వర్తించబోదని నేడు సుప్రీం తీర్పుతో అర్థమైంది. ఈ కేసులో విచారణ ఇంకా మొదలుకాలేదు. అయినాసరే కఠిన ఉపా చట్టం కింద ఉమర్‌ఖలీద్‌ను ఐదేళ్లుగా కారాగార చీకటికొట్టంలో పడేశారు. ఇది విచారణకు ముందే జైలుశిక్ష అమలుచేయడం కాదా?.

మహిళా భక్తులపై రేప్, హత్య కేసులో 2017లోనే 20 ఏళ్ల శిక్షపడిన డేరాసచ్ఛా సౌదా చీఫ్ గుర్మీత్ రాంరహీం సింగ్‌కు మరోసారి తాత్కాలిక జైలుశిక్ష నిలుపుదల(పెరోల్) అవకాశం కల్పించారు. ఇప్పటికి ఆయన ఇలా 15 సార్లు పెరోల్‌మీద బయటికొచ్చాడు. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయమా. ఒకరు(ఖలీద్) నిరవధికంగా జైల్లో మగ్గిపోతుంటే మరొకరు(గుర్మీత్ బాబా) బయట డిమాండ్‌కు తగ్గట్లు ఎప్పటికప్పుడు జైలు నుంచి సెలవుల మీద విడుదలై సంతోషంగా గడుపుతున్నారు" అని జాన్ బ్రిటాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పును బీజేపీ స్వాగతించింది. సత్యమేవ జయతే అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సైతం తీర్పుపై సంతోషం వ్యక్తంచేశారు.

## 11న సోమనాథ్ ఆలయానికి వెళ్తున్నా

న్యూఢిల్లీ:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 11వ తేదీన గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని సందర్శించుకోనున్నారు. సోమనాథ్ ఆలయంపై విదేశీయులు మొదటిసారిగా దాడి జరిపి, ధ్వంసం చేసిన దురాగతానికి వెయ్యేళ్లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయి. సోమనాథ్‌ను 11వ తేదీన సందర్శించుకోనున్నట్లు ప్రధాని సోమవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం భారతీయ నాగరికత అజేయ సంకల్పానికి, బలానికి గొప్ప నిదర్శనం. విదేశీ దురాక్రమణదారులు ఎన్నిసార్లు దాడి చేసినా, ప్రతిసారీ ఈ పుణ్యక్షేత్రం మరింత వైభవోపేతంగా తిరిగి పుంజుకుంది'అని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతం వెరావల్‌లో అరేబియా సముద్ర తీరాన ఉన్న సోమనాథ్ ఆలయంలో శివుడు కొలువుతీరాడు.

ఈ ఆలయంపై మొదటిసారిగా తుర్కియే పాలకుడు గజనీ మహ్మద్ దాడి చేసి, విధ్వంసం సృష్టించాడు. అప్పట్నుంచి పలువురు విదేశీ పాలకులు దాడి చేసి దోచుకున్నారు. 'సోమనాథ్ కథ కేవలం ఒక ఆలయానికి సంబంధించింది కాదు, అది మన సంస్కృతిని, నాగరికతను కాపాడిన భారతమాత కోట్లాది సంతానానికి చెందిన అజేయమైన సాహసగాథ. శతాబ్దాల తరబడి దాడులు, వలసవాద దోపిడీలను తట్టుకుని నిలబడిన ఈ స్ఫూర్తే నేడు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక వృద్ధిలో అత్యంత వేగంగా ముందుకు సాగుతున్న దేశంగా నిలబెట్టింది'అని మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఆలయాన్ని పునర్నిర్మించే విషయంలో సర్దార్ పటేల్ ఎంతో చొరవ కనబరిచారన్న ప్రధాని మోదీ...1951లో జరిగిన ఆలయ ఉత్సవాలకు అప్పటి ప్రధాని నెహ్రూ వెళ్లలేదంటూ నిందించారు. '1947లో దీపావళి వేడుకల వేళ సర్దార్ పటేల్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అప్పుడే ఆయన ఆలయానికి పూర్వవైభవం తేవాలని నిర్ణయించుకున్నారు" అని మోదీ చెప్పారు.

## ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కోర్టుకెళతా

సాగర్ ఐల్యాండ్

పశ్చిమ బెంగాల్ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియను సవాల్ చేస్తూ కోర్టుకు వెళతామని టీఎంసీ చీఫ్, సీఎం మమతా బెనర్జీ సోమవారం ప్రకటించారు. ఎస్ఐఆర్ అధికారుల వేధింపులు, ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలు భయాందోళనలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆమె ఆరోపించారు. దక్షిణ 24 పరగణాల జిల్లా సాగర్ ఐల్యాండ్‌లో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడారు. ఎస్ఐఆర్ సిబ్బంది ఎలాంటి సహేతుక కారణాలను చూపకుండానే అర్హులైన ఓటర్ల పేర్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారని విమర్శించారు. మామాలుగా చేపట్టే ఈ ప్రక్రియను ఎన్నికల వేళ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఆయుధంగా వాడుతున్నారని ఆరోపించారు. ఓటర్ల పట్ల అమానవీయంగా వ్యవహరించడం, ఎస్ఐఆర్ నేపథ్యంలో సంభవిస్తున్న మరణాలపై 6న(మంగళవారం) కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. ఓ సాధారణ పౌరురాలిగా అవసరమైతే దీనిపై సుప్రీంకోర్టు తలుపు కూడా తడతానన్నారు. 'నేను కూడా అనుభవమున్న లాయర్‌నే'అంటూ వ్యాఖ్యానించారు. అయితే, ఈ పిటిషన్‌ను వ్యక్తిగతంగా వేస్తారా, రాష్ట్ర ప్రభుత్వం లేక టీఎంసీ పక్షానా అనే విషయం ఆమె స్పష్టంగా తెలపలేదు. వ్యాధి గ్రస్తులు, వృద్ధులు కూడా తాము అర్హులైన ఓటర్లమే అని నిరూపించుకోవాల్సి వస్తోందన్నారు. ఏమాత్రం కనికరం చూపకుండా ఎస్ఐఆర్ సిబ్బంది వారినీ క్యూలలో నిల్చోబెడుతున్నారని ఆరోపించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని మమత చెప్పారు. బెంగాలీలో మాట్లాడటం ఈ దేశంలో నేరమైపోయిందంటూ ఆమె..'నన్ను చంపినా సరే, బెంగాలీలోనే మాట్లాడుతా'అని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ప్రజలు తాయిలాలు చూపే బీజేపీ.. గెలిచిన తర్వాత అణచివేతలకు పాల్పడుతుందని హెచ్చరించారు. 'ఎన్నికలకు ముందు తలా రూ.10 వేలు పంచిపెడుతుంది.. ఆ తర్వాత వారిపైకి బుల్‌డోజర్లను నడుపుతుంది'అంటూ బీజేపీపై ధ్వజమెత్తారు.

## బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్

బియ్యం ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు అగ్ర స్థానంలో ఉన్న చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా, చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితమైందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన 25 రకాల పంటలకు చెందిన 184 కొత్త వంగడాలను మంత్రి విడుదల చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధిలో భారత్ గొప్ప విజయం సాధించిందని, ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు బియ్యాన్ని ఎగుమతి చేసే ప్రముఖ దేశంగా మారిందని అన్నారు. ఈ కొత్త వంగడాలను సాధ్యమైనంత త్వరగా రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు పప్పుధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలోని గత 11 ఏళ్లలో 3,236 అధిక దిగుబడినిచ్చే వంగడాలకు ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. వాతావరణ మార్పులు, కరవు, నేలల లవణీయత వంటి సవాళ్లను తట్టుకునేలా ఈ కొత్త వంగడాలను రూపొందించినట్లు వివరించారు. ఒకప్పుడు ఆహార కొరత ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి చేరిందని చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. ఐసీఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విత్తన కంపెనీల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు.

## అత్యాచారం కేసులో దోషి..

## పెరోల్‌పై 15వ సారి బయటకు వచ్చిన డేరా బాబా

డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ 40 రోజుల పెరోల్ పొందడంతో సోమవారం సునారియా జైలు నుంచి విడుదల య్యారు. తన ఇద్దరు భక్తురాళ్లపై అత్యాచారం చేసినందుకు 20 సంవత్సరాల జైలు శిక్ష అనుభవి స్తున్న ఆయన, 2017లో దోషిగా తేలినప్పటి నుంచి పెరోల్‌పై బయట కు రావడం ఇది 15వ సారి కావడం గమనార్హం. పెరోల్ కాలంలో, ఆయన హర్యానాలోని సిర్సాలో గల డేరా ప్రధాన కార్యాలయంలో ఉంటారని ఆ శాఖ ప్రతినిధి మరియు న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 16 సంవత్సరాల క్రితం జర్నలిస్టు హత్య కేసులోనూ గుర్మీత్ సింగ్‌ను కోర్టు 2019లో దోషిగా తేల్చింది. గతంలో 2025 ఏప్రిల్‌లో 21 రోజులు, 2025 ఆగస్ట్‌లో కూడా 40 రోజుల పెరోల్‌పై ఆయన బయటకు వచ్చారు. మరోవైపు గుర్మీత్ సింగ్‌కు పెరోల్ ఇవ్వడాన్ని సిక్కు సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి.

## అమెరికా నిర్బంధంలో వెనెజువెలా అధ్యక్షుడు

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అమెరికా సైనిక బలగాలు పట్టుకుని న్యూయార్క్‌కు తరలించిన ఘటన ప్రపంచవ్యాప్తంగా భారీ చర్చను రేపుతోంది. ఈ సంఘటనపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ, అమెరికా తనను తాను ప్రపంచ పోలీస్‌గా భావించుకుని ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఏ దేశానికి అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించడానికి అర్హత లేదని, బలప్రయోగంతో తమ ఇష్టాలను రుద్దడం సరికాదని స్పష్టం చేశారు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితి అస్థిరంగా ఉందని ఆయన చెప్పారు. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు అన్ని దేశాల సార్వభౌ మత్వాన్ని రక్షించాలని అన్నారు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనా, ఈ ఘటనను ఏకపక్ష దురాక్రమణగా అభివర్ణిస్తూ అమెరికాపై తీవ్ర విమర్శలు గుప్పించింది.